

ఆపరేషన్ 'రెడ్ శాండిల్'!

- 'ఎర్ర' స్మగ్లర్లపై మరోసారి ఉక్కుపాదం
- డిప్యూటీ సీఎం హెచ్చరికలతో స్పష్టమైన ప్రభుత్వ వైఖరి
- యంత్రాంగంపై పెరిగిన ఒత్తిడి

ఎర్రచందనం జోలికొస్తే తాట తీస్తామంటూ హెచ్చరికలు.

స్మగ్లర్లకు సహకరించొద్దంటూ స్థానికులకు పిలుపు.

సెంటిమెంట్‌ను గుర్తుచేస్తూ స్మగ్లింగ్ అడ్డుకట్టలో భాగస్వాములు కావాలని శ్రీవారి భక్తులకు వినతి.

ఒక్క చెట్టూ నరక్కుండా చూడాలంటూ యంత్రాంగానికి ఆదేశాలు.

శనివారం నాటి తిరుపతి పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాటల ఉద్దేశంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలన్న ప్రభుత్వ వైఖరిని స్పష్టంచేసింది. ఆపరేషన్ కగార్ తరహాలో త్వరలోనే స్మగ్లర్లపై చర్యలు ఉంటాయనీ ఆయన స్పష్టం చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



టాస్క్‌ఫోర్సు యూనిఫామ్‌లా.. రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ధరించే యూనిఫామ్‌ను పోలిన ప్యాంటు వేసుకుని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లా పర్యటనకు వచ్చారు. అది టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, అధికారుల్లో ఉత్తేజాన్ని నింపింది.

శేషాచల అడవుల నుంచి అంతర్జాతీయ మార్కెట్ దాకా పాతుకుపోయిన నెట్‌వర్క్‌తో వేల కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లపై రాష్ట్ర ప్రభుత్వం మరోమారు ఉక్కుపాదం మోపే పరిస్థితి కనిపిస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుపతి నుంచి జారీ చేసిన హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటన్నది స్పష్టమైపోయింది. ఆయన తిరుపతి పర్యటన, సంబంధిత శాఖతో నిర్వహించిన సమీక్షలతో అధికార యంత్రాంగంపై ఒత్తిడి పెరిగింది. పవన్ ఆహార్యం ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రభుత్వ కఠిన వైఖరిని బలంగా చాటినట్టయింది. దీంతో 2014-19 నాటి టీడీపీ ప్రభుత్వ తరహాలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను కఠినంగా అడ్డుకునే ప్రయత్నాలు మళ్లీ మొదలైనట్టుగా భావించాల్సి వస్తోంది. మామండూరు అటవీ ప్రాంతంలో పర్యటించిన అనంతరం తిరుపతి మంగళంలోని ఎర్రచందనం గోదామును తనిఖీ చేశారు. అక్కడి భారీ పరిమాణంలో పోగుపడిన ఎర్రచందనం దుంగలను చూసి నిశ్చేష్టులయ్యారు. ఎన్ని లక్షల చెట్లు నరికి వుంటే ఇన్ని దుంగలు పట్టుబడ్డాయంటూ తీవ్ర వేదనకు లోనయ్యారు. ఇక పట్టుబడకుండా సరిహద్దులు దాటిన దుంగల పరిమాణం తలచుకుని ఆవేదన చెందారు.

వేంకటేశ్వరస్వామి సెంటిమెంట్‌తో..

'తిరుమలలో శ్రీవారికి గాయమైనపుడు వచ్చిన రక్తంతో ఎర్రచందనం చెట్లు పుట్టాయి. అందుకే శేషాచలంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా అవి కనిపించవు' అన్న పవన్ వ్యాఖ్యల వెనుక.. ఎర్రచందనాన్ని వేంకటేశ్వరస్వామితో ముడిపెట్టి ఆ సెంటిమెంట్‌తో కాపాడేందుకు ప్రయత్నించినట్టుగా కనిపిస్తోంది. అందుకనే శేషాచలం అడవుల్లోని పవిత్ర ఎర్రచందనం వృక్షాలను నరకొద్దంటూ స్మగ్లర్లతో పాటు వారికి సహకరించే స్థానికులకు సైతం విజ్ఞప్తి చేయడం అందరినీ ఆకట్టుకుంది.

ఆపరేషన్ కగార్‌ను గుర్తుచేస్తూ..

ఎర్రచందనం వృక్షాల నరికివేత కొనసాగితే ఆపరేషన్ కగార్ తరహాలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి స్మగ్లర్ల తాటతీస్తామని పవన్ హెచ్చరించారు. కూంబింగ్, నిఘా, తనిఖీలు వంటివి పటిష్టంగా చేపట్టాలని, చెట్ల నరికివేతను ఆపడానికి కఠినంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలు, చర్యలు గత టీడీపీ ప్రభుత్వ చర్యలను గుర్తుకు తెస్తున్నాయి.



మామండూరులో మొక్కలను పరిశీలిస్తున్న పవన్



గుంటి మడుగు వాగులోన..

మామండూరు అటవీ గెస్ట్‌హౌస్ నుంచి దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండే గుంటి మడుగు వాగు వద్దకు అధికారులతో కలసి పవన్ వెళ్లారు. వాగు ఒడ్డున కూర్చుని, పారే నీటిలో కాళ్లను ఆడిస్తూ ఆహ్లాదంగా గడిపారు. పరిసరాలను ఆసక్తిగా తిలకించారు. వాగుకు రెండువైపులా ఉన్న చెట్ల వివరాలపై ఆరాతీశారు. ఎర్రచందనం స్మగ్లింగ్, స్మగ్లింగ్ నిరోధక ఆపరేషన్స్, టాస్క్‌ఫోర్స్ అటవీ సిబ్బంది కూంబింగ్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గత టీడీపీ పాలనలో ఏం జరిగిందంటే..

2004-2014 నడుమ పదేళ్ల పాటు శేషాచల అడవుల్లో ఎర్రచందనం వృక్షాల నరికివేత ఇష్టారాజ్యంగా సాగింది. ఎక్కడికక్కడ అప్పటి అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు స్మగ్లర్లకు కీలకంగా సహకరించారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్ల కోసం చెట్లు నరికేందుకు స్థానికంగా కూలీలను సమకూర్చారు. స్మగ్లర్ల నుంచీ వాటాలు తీసుకుని ఆర్థికంగా బలపడ్డారు. మరికొందరు నేరుగా తామే స్మగ్లర్ల అవతారం ఎత్తారు. వారిలో కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగానూ ఎన్నికయ్యారు. ఎన్నికల్లోనూ స్మగ్లర్ల డబ్బు కీలక పాత్ర పోషించింది. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వం రావడంతో పరిస్థితి మొత్తం మారింది. సీఎం చంద్రబాబు కన్నెర్ర చేయడంతో పోలీసులు స్మగ్లర్లను అరెస్టు చేయడమే కాదు పీడీ యాక్టు ప్రయోగించారు. అందులో కొందరు టీడీపీ నేతలున్నా ప్రభుత్వం ఖాతరు చేయలేదు. టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేశారు. ఐజీ స్థాయి అధికారిని అధిపతిగా నియమించారు. సిబ్బంది సంఖ్యను పెంచి, ఆయుధాలు కూడా అందించారు. అప్పట్లో శేషాచల అడవుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ దెబ్బకు తమిళనాడు నుంచీ కూలీలు రావడం ఆగిపోయింది. ఇపుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీరు సరిగ్గా నాటి ప్రభుత్వ నిర్ణయాలను గుర్తు చేస్తోంది. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కూడా కఠిన వైఖరి తీసుకుంటోందనే సంకేతాలను ఇస్తోంది.

కళత్తూరును వీడని బురద

- చురుగ్గా సాగుతున్న సహాయక చర్యలు

కేవీబీపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కళత్తూరు దళితవాడలో ఇంకా బురద తొలగలేదు. గురువారం ఓళ్లూరు రాయలచెరువు తెగడంతో వచ్చిన నీటి ప్రవాహంతో ఊరంతా బురదమయంగా మారింది. శనివారం ఉదయం నుంచీ డీపీవో సుశీలాదేవి ఆధ్వర్యంలో సహాయక చర్యలు చురుగ్గా సాగుతున్నాయి. ఇళ్లలో పేరుకుపోయిన బురద తీయడానికి ప్రత్యేక కార్మికులను ఏర్పాటు చేశారు. వీధుల్లో బురదను ట్రాక్టర్ల ద్వారా తొలగించి శుభ్ర పరిచారు. డిస్కం ఏఈ మునికుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ పునరుద్ధరణకు అధికారులు, సిబ్బంది విశేష కృషి చేస్తున్నారు. 133 పశువులకువైద్యాధికారి పార్థిబన్ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ వేశారు. వైద్యాధికారి రామనాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఇంటింటికి రోగ నివారణ మందులను పంపిణీ చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. తహసీల్దారు రోశయ్య ఆధ్వర్యంలో పాతపాళెం అరుంధతివాడలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.



కళత్తూరు దళితవాడలో మట్టి తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు



నీటిలో తేలియాడుతున్న ట్రాక్టర్

■ బురదలోనే వాహనాలు

కళత్తూరు దళితవాడలో సుమారు 20 ట్రాక్టర్లు కొట్టుకుపోయి చెరువు, పొలాల్లో పడ్డాయి. సుమారు 150 ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. ఇవన్నీ బురదలో కూరుకుపోయి పనికిరాకుండా పోయాయి.

వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు8(ఆంధ్రజ్యోతి): కేవీబీ పురం మండలంలో ఓళూరు చెరువు తెగి ముంపునకు గురైన ప్రాంతాల్లో తమ సిబ్బంది యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ శనివారం చెప్పారు. కేవీబీ పురంలోని 33-11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మునగడంతో కళత్తూరు, ఎస్ఎల్‌పురం, పిసీకెపురం, రంగయ్యగుంట, రాజులకండ్రిగ, కొటాలమిట్ట తదితర గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 223 విద్యుత్ స్తంభాలు, 78 ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దీంతో 2093 (వ్యవసాయ, గృహ, తాగునీటి) సర్వీసులకు సరఫరా ఆగింది. శుక్రవారం రాత్రికి 89 స్తంభాలు, 78 ట్రాన్స్‌ఫార్మర్లు పునరుద్ధరించి 1353 విద్యుత్ సర్వీసులకు సరఫరా ఇచ్చాం. మిగిలిన సర్వీసులకు శనివారం పూర్తి చేశాం. దీనికోసం రెండు రోజులు శ్రమించిన అధికారులు, సిబ్బందికి అభినందనలు' అని శివశంకర్ పేర్కొన్నారు.

■ ఈ పొలంలో సాగు చేసేదెట్టా?

రాళ్లు తేలిపోయి, మట్టి కొట్టుకుపోయి, ఇసుక మేట వేసిన ఈ పొలం పాతపాళేనికి చెందిన డిల్లీబాబుది. పొలం ఆనవాళ్లు లేకుండా పోయింది. ఇంకా ఆదెమ్మ రెండు ఎకరాల చెరకు పంట దెబ్బతిని మట్టి, ఇసుక పొలంలో మేట వేసింది. చంద్రారెడ్డి బావి, పొలం మేట వేసి మట్టి చేరిపోయింది. ఆ పొలాల్లో సాగు చేయాలంటే ఎంత ఖర్చవుతుందో చెప్పలేం. సుమారు 800 ఎకరాల వరకు మేట వేసి పొలాలు మొత్తం పనికిరాకుండాపోయాయి.





వరలక్ష్మి



వర్షిత్



ప్రశాంత్ మృతదేహాలు

ఎంత పని చేశావు తల్లీ..!

- భర్త మందలించాడని ఇద్దరు బిడ్డలు సహా తల్లి ఆత్మహత్య
- ఉగ్గుమూడిలో విషాదం

సూళ్లూరుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భర్త మందలిస్తే ఉసురు తీసుకోవాలా? కుటుంబంలో కలహాలుంటే అభం శుభం తెలియని బిడ్డల ప్రాణాన్నీ బలిగొనాలా? ఆవేశంలో ఎంత చేశావు తల్లీ.. అంటూ రోదిస్తున్నారామె కుటుంబీకులు, బంధుమిత్రులు. ఇద్దరు చిన్నారుల సహా బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న వరలక్ష్మి జీవితం విషాదాంతమైంది. ఈ ఘటన సూళ్లూరుపేట మండలం ఉగ్గుమూడిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉగ్గుమూడి ఎగువ హరిజనవాడకు చెందిన వరలక్ష్మికి, దిగువ హరిజనవాడకు చెందిన ఉగ్గుముడి మాధవయ్యతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ప్రశాంత్(2), వర్షిత్(4) పిల్లలు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య చిన్నపాటి వివాదాలు తలెత్తాయి. ఈ క్రమంలో వరలక్ష్మి(24)ని భర్త మందలించాడు. దీంతో కలత చెందిన ఆమె శనివారం ఇంట్లో భర్తలేని సమయంలో గ్రామ సమీపంలోని నేలబావి వద్దకు ఇద్దరు బిడ్డలతో వెళ్లింది. మొదట పిల్లలను బావిలో తోసి తానూ దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం నుంచి తల్లీ బిడ్డలు కనిపించకపోవడంతో బంధువులు చుట్టుపక్కల వెదికారు. సాయంత్రం పొలాల్లోకి పనుల నిమిత్తం వెళ్లిన గ్రామస్తులకు నేలబావిలో వర్షిత్ మృతదేహం తేలిఉండటం కనిపించింది. వీరి సమాచారంతో గ్రామస్తులు, బంధువులు అక్కడకు చేరుకుని బావిలో నుంచి తల్లి, బిడ్డల మృతదేహాలను వెలికితీశారు. ఎంత పని చేశావమ్మా వరలక్ష్మీ.. చిన్న బిడ్డలనూ బావిలో తోసి ఆత్మహత్య చేసుకునేందుకు మనసు ఎలా వచ్చిందమ్మా అంటూ గుండెలవిసేలా రోదించారు. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లీబిడ్డల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బావిలో మృతదేహాలను వెలికితీస్తున్న దృశ్యం

మద్యంతాగి బడికొచ్చిన టీచర్ సస్పెన్షన్

తిరుపతి(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... ఏర్పేడు మండలం ఆముదూరు ఎంపీపీఎస్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లారు. పల్లం హరిజనవాడ ఎంపీపీఎస్ పాఠశాలలో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు సి.నాగరాజును డిప్యూటేషన్‌పై అక్కడికి పంపారు. ఆయన మద్యం తాగి విధులకు హాజరవ్వడమే కాకుండా పాఠశాల ఆవరణలో పడిపోయారు. తరగతిలో ఆయన తీరుతో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ విషయంపై విచారణ జరపాలని ఎంఈవోను డీఈవో ఆదేశించారు. నివేదిక ఆధారంగా నాగరాజును విధుల నుంచి తొలగిస్తున్నట్టు డీఈవో తెలిపారు.

నేడు ముసలిమడుగుకు పవన్‌కల్యాణ్

పలమనేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదివారం ఉదయం పలమనేరు సమీపంలోని ముసలిమడుగు కుంకీ ఏనుగుల క్యాంపును సందర్శించనున్నారు.తిరుపతి నుంచి ఉదయం 10.50 గంటలకు ముసలిమడుగులోని కుంకీ ఏనుగుల శిక్షణ శిబిరానికి 10.50 గంటలకు వస్తారు.కుంకీ ఏనుగుల శిబిరాన్ని, గజారామాన్ని, నగరవనాన్ని ప్రారంభిస్తారు.అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడతారు.12.45గంటలకు తిరుగుప్రయాణమవుతారు.

ఎంత పెద్ద పామో..!

తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీ నగర్‌లోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం వద్ద శనివారం 10 అడుగుల కొండచిలువ పట్టుబడింది. స్థానికుల సమాచారంతో టీటీడీ కాంట్రాక్టు ఉద్యోగి భాస్కర్ నాయుడు ఈ పామును పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు. అలాగే, మొదటి ఘాట్‌రోడ్డులోని ఏడోమైలు వద్ద సుమారు 15 అడుగుల కొండ చిలువ పట్టుబడింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



కొండచిలువతో భాస్కర్‌నాయుడు

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న సుధారెడ్డి,భక్తులు

చంద్రగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె పంచాయతీ నూలివెంకన్న కొత్తపల్లిలో ముత్యాలమ్మ ఆలయ పదవ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కలశారాధన, గణపతి, నవగ్రహ హోమాలు, లలిత సహస్రనామ, శ్రీసూక్త, నవదుర్గ హోమాలు, మహాపూర్ణాహుతి, అనంతరం మూలమూర్తికి పంచాంబృతాభిషేకం, స్నపన అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ప్రాకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి, అమ్మవారికి సారె సమర్పించారు. టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి,ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, లంకెళ్ల లలితకుమారి, ఎంపీటీసీ ఏసీ శేఖర్, నూలి వెంకన్ననాయుడు, చెన్నంశెట్టి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి రథోత్సవం



రథంలో ఊరేగుతున్న శివపార్వతులు

చంద్రగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపాన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం శివనామ స్మరణలతో మార్మోగింది. అంతకు ముందు స్వామివారికి రుద్రాభిషేకం, చందనాలంకరణ చేశారు. ఆనందవల్లి దేవికి అభిషేకించాక భక్తులకు దర్శనం కల్పించారు. శివపార్వతుల ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపజేసి మాడవీధుల్లో నిర్వంచారు. రాత్రి 7 గంటలకు కల్పతరువు వాహనంపై అదిష్టింపజేసి దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సుమతమ్మ,ఉపాధ్యాయులు

పాకాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన వృత్తి విద్యా కోర్సుల్లో దామలచెరువు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆటో మొబైల్ కోర్సులో భద్రీనాథ్, దిలీప్, కార్తీక్, శిరీష లు మొదటి స్థానం సాధించారు. అగ్రికల్చర్‌లో దివ్య, వజీహ, హర్మిన్, విద్యశ్రీ, జాహ్నవి తృతీయ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థులను హెచ్‌ఎం సుమతమ్మ, ఉపాధ్యాయులు ప్రభ, మనీష, సీఆర్పీ శ్రీనివాసులు శనివారం అభినందించారు. పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు హర్షిత్, మోహన్, షారూక్, గణేష్‌బాబులు ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించారు. ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు జయచంద్ర, రెడ్డిచైతన్యలు విజేతలను అభినందించారు.

జడ్పీ ఉన్నత పాఠశాలకు వితరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జాహ్నవి

తిరుచానూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు శనివారం ఎడిఫై స్కూలులోని కమ్యూనిటీ సర్వీస్‌క్లబ్, ప్రణీత్ ఫౌండేషన్ సంయుక్తంగా ల్యాబ్. స్పోర్ట్స్ మెటీరియల్‌ను వితరణ చేశాయి. స్కూలు అధినేత ప్రణీత్, డీన్ జాహ్నవిలు రూ.2లక్షల విలువైన ఈ ఫర్నిచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులచే ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సర్వీస్‌క్లబ్, ప్రణీత్ ఫౌండేషన్ సంయుక్తంగా విద్యార్థులకు ఉపయోగపడే పరికరాలను అందించినట్లు తెలిపారు కార్యక్రమంలో ఎడిఫై ప్రిన్సిపాల్ దేవరాజులు, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవర్లకు ఉత్సవర్లకు కల్యాణోత్సవం, సాయంత్రం ఊంజల్ సేవలను నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాల్లో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు రాజ్ కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, అర్చకులు పాల్గొన్నారు.

హనుమత్ సంహార కాలభైరవ హోమం



రామచంద్రాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శక్తిపీఠంలో కాలభైరవ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం హనుమత్ సంహార కాలభైరవ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మరకతశక్తి కాళీ అమ్మవారితోపాటు కాలభైరవస్వామికి తిరుమంజనం చేశారు. ఉదయం 9గంటలకు 11వేల గారెలతో వేదపండితులు హోమాన్ని ప్రారంభించగా మధ్యాహ్నం 12గంటలకు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతిస్వామి పూర్ణాహుతితో ముగించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ఊంజల్‌సేవ జరిగింది. పీఠం కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్డీహెచ్‌ఆర్ కాలేజి విద్యార్థుల రక్తదానం



తిరుపతి రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): న్యూబాలాజీ కాలనీలోని ఎస్డీహెచ్‌ఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని 100మంది విద్యార్థులు, అధ్యాపకులు రుయా రక్తనిధికి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రుయా ఆసుపత్రిలో దాదాపు 250మంది అన్నదానం చేశారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ ఉష, అధ్యాపకులు పాల్గొన్నారు.

కర్ణాటక వృద్ధుడి అదృశ్యం



గణపతిరామప్ప నాయక్

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటకలోని హోణవర్ తాలుకా కరబయల్‌కు చెందిన గణపతి రామప్ప నాయక్(63) కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 8న తిరుమలకు వచ్చాడు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని 18వ కంపార్టుమెంట్‌కు చేరుకున్న అనంతరం కనిపించలేదు. కుటుంబ సభ్యులు కంపార్టుమెంట్లతో పాటు తిరుమల, సొంతూరు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతని మోహన్ నాయక్ శనివారం తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. అతని ఆచూకీ తెలిసిన వాళ్లు 94407 96769 నెంబరుకు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఏర్పేడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం తెల్లవారు జామున ఏర్పేడు మండలం మేర్లపాక దళితవాడ సమీపంలోని పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి 35 సంవత్సరాలు ఉంటుంది. ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డిని సంప్రదించాలని కోరారు.

ప్రతి కుటుంబానికీ న్యాయం చేస్తా: ఎంపీ

కేవీబీపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలం లోని కళత్తూరు దళితవాడలో శనివారం ఎంపీ గురుమూర్తి పర్యటించారు. ప్రతి కుటుంబానికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. చెరువు తెగిన విధానాన్ని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఓళ్లూరు రాయలచెరువును పరిశీలించారు. ముందే హెచ్చరించినా అధికారులు నిర్లక్ష్యం తోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా చెరువు కట్టను పటిష్ఠం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు వైసీపీ సమన్వ యకర్త నూకతోటి రాజేష్, మండలాధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, వైసీపీ నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతామోహన్ పరామర్శ

కళత్తూరు దళిత వాడను మాజీ ఎంపీ చింతామోహన్ సందర్శించారు. ప్రతి కుటుంబాన్ని పలక రిస్తూ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సాయం చేయడంలో విఫలమైందన్నారు. స్వచ్ఛంద సంస్థలే ఎక్కువగా ఆదుకుంటున్నాయన్నారు.

అనుమానాస్పద స్థితిలో సత్యవేడువాసి మృతి



మృతి చెందిన చంద్రశేఖర్

నాయుడుపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - విన్నమాల ఫ్లైఓవర్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో సత్యవేడువాసి చంద్రశేఖర్(46) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... సత్యవేడు ప్రాంతంలోని మదనపాళెం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఓ ప్రైవేట్ కర్మాగారంలో విధులు నిర్వహిస్తు న్నాడు. ఈనెల 5వ తేదీ ఇంటి నుంచి అలిగి వచ్చేశాడు. శనివారం ఉదయం ఫ్లైఓవర్ కింద మృతి చెంది ఉండటంతో స్థానికులు గమ నించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగిన్నట్లు పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలంలో మద్యం బాటిల్, పురుగులమందు సీసా లభ్యమైంది. మృతడు తన కుమారుడి ఫోన్ నెంబరు కాగితం మీద రాసి సంచిలో పెట్టుకొని ఉండటంతో కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వా స్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ ధర్మ తెలిపారు.

పేర్నాడు-వేనాడు రోడ్డుకు అనుమతివ్వండి



పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం పేర్నాడు, తడ మండలం వేనాడు మధ్య రోడ్డు నిర్మానానికి అనుమతి మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విన్నవించారు. శనివారం తిరుపతి పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎంను ఎమ్మెల్యే కలిశారు. పులికాట్ పరివాహక ప్రాంతంలో ఉన్న పేర్నాడు, వేనాడు రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతించకపోవడంతో సరైన దారిలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే దొరవారిసత్రం మండలం మీజూరు వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ఇటువంటి అటవీశాఖ ఆంక్షలే అడ్డుగా ఉన్నాయని చెప్పారు. వీటికి అనుమతులు మంజూరు చేస్తే సుమారు 5వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటికి ఇబ్బందులు తొలగుతాయన్నారు. స్పందించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ సమస్యను పరిష్కారించాలంటూ ఇదివరకే సంబంధిత అధికారులను ఆదేశించామని, వీలైనంత త్వరలోనే పూర్తిస్థాయి అనుమతులు మంజూరవుతాయని హామీ ఇచ్చారు.

జోరుగా ఉపాధి కూలీల ఈకేవైసీ ప్రక్రియ

ఇప్పటికే 85 శాతం మంది నమోదు ● త్వరలోనే ఆన్‌లైన్ హాజరు విధానం అమలుకు చర్యలు



హాజరు కోసం ఫొటో తీస్తున్న ఏపీవో జ్యోతిశ్రీ

తిరుపతిరూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధిహామీ కూలీల హాజరులో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. కూలీలు నష్టపోకుండా, అవకతవకలు జరగకుండా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్‌ఎంఎస్), ఫేస్ ఆర్‌డీ యాప్‌ల ద్వారా హాజరు విధానానికి శ్రీకారం చుడుతున్నాయి. ఈక్రమంలో రూరల్ మండలంలో ఈకేవైసీ ప్రకియ జోరుగా సాగుతోంది. మండలంలో 5665మంది కూలీలకు గాను 4825మంది మంది(85.37శాతం) కూలీల ఈకేవైసీ నమోదు పూర్తయింది. 6239మంది ఆధార్ సీడెడ్ కూడా పూర్తయింది. వందశాతానికి చేరుకునేలా చేరుకునేలా నమోదు ప్రక్రియ వేగవంతం చేసినట్లు డ్వామా అధికారులు చెబుతేన్నారు. ఇప్పటివరకూ మాన్యువల్‌గా మస్టర్ల నమోదు చేసేవారు. త్వరలోనే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తారు. ఎన్‌ఎంఎస్, ఫేస్ ఆర్‌డీయాప్‌ల్లో కూలీల హాజరు ఉదయం 8గంటల కల్లా నమోదు చేయాల్సి ఉంటుంది. ఆతర్వాత పనిచేస్తున్నారా..లేదా అని తెలుసుకునేందుకు సాయంత్రం ఒకసారి నమోదు చేస్తారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌గా చిత్తూరులో ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తున్నారు.



డిప్యూటీ సీఎం పవన్ రాకతో సందడి



వాహనంపై నిలబడి అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్

తిరుపతి రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం మధ్యాహ్నం తనపల్లె రోడ్డులోని తాజ్‌హోటల్‌కి చేరుకున్నారు. ఆయన్ను కలిసేందుకు స్థానిక జనసేనపార్టీనేతలు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు ఎక్కువసంఖ్యలో చేరుకోవడంతో హోటల్ బయట సందడి నెలకొంది. మధ్యాహ్నం 3గంటలకు కలెక్టరేట్‌కి బయలుదేరివెళ్లినప్పుడు జైపవన్..జైజై పవన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాన్వాయ్‌ని సమీపించేందుకు కొందరు ప్రయత్నించగా రోప్‌పార్టీ పోలీసులు నియంత్రించారు. కోడూరు నుంచి వచ్చిన ఓదివ్యాంగ అభిమాని, మరికొందరు ఆయన ఫోటో ఫ్రేమ్‌ని చేతపట్టుకుని కనిపించారు. పవన్ కాన్వాయ్‌పై నిలబడి వారికి అభివాదం చేశారు.

రేణిగుంట: తిరుపతి విమానాశ్రయం చేరుకున్న పవన్‌కల్యాణ్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర హస్తకళ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టేసాయి, రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి చలపతిరావు, రాష్ట్ర అటవీశాఖ సలహాదారులు మల్లికార్జున్ రావు, జిల్లా డీఎఫ్‌ఓ సాయిబాబా, ఇతర జిల్లాల డీఎఫ్‌ఓలు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన మామండూరు వెళ్లారు. తర్వాత తిరుపతిలో కార్యక్రమం ముగించుకొని సాయంత్రం విమానాశ్రయం చేరుకోగా కలెక్టర్, ఎస్పీ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలువల విజయశ్రీ, జనసేన నాయకులు కిరణ్ రాయల్, రాజారెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

లా కాలేజీలో ముగిసిన మూట్‌కోర్ట్ పోటీలు



మూట్‌కోట్ విజేతలతో లా కళాశాల ప్రతినిధులు

తిరుపతి రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన మూట్‌కోర్ట్ పోటీలు శనివారం ముగిశాయి. శనివారం ఫైనల్‌లో ప్రతిభావంతంగా వాదనలను వినిపించిన విద్యార్థుల్లో విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ బిజయకుమార్ బెహర ప్రకటించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భూసేకరణ, పునరావాసం, పునఃపరిష్కరణ అథారిటీ ప్రిసైడింగ్ అధికారి అన్వర్‌భాషా హాజరయ్యారు. ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి, కార్యదర్శి లక్ష్మీ ప్రశస్త, మూట్‌కోర్ట్ కమిటీ సభ్యులు జూలీ, రేష్మీ, అనుశ్రీ, శుభమస్తు, ఆదీరా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



సీహెచ్ రుకు మస్తాన్, వి.శివనేష్

తడ, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యా ర్థులు ఎంపిక య్యారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-17 విభాగంలో తడ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్ రుకు మస్తాన్, వి.శివనేష్ ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. అలాగే అండర్-14 విభా గంలో వి.గోకుల్ రాష్ట్రస్థాయి పోటీ లకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు హరిత, రేవంత్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను ఎంఈవోలు వేములు, మల్లికార్జునరావు అభినందించారు.

నగర పంచాయతీ కోసం ప్రతిపాదనలు

వరదయ్యపాళెం, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): వరదయ్యపాళెం మేజర్ పంచాయ తీని నగర పంచాయతీగా మార్చుచేసేందుకు అధికారులు ప్రభు త్వానికి నివేదికలు పంపిం చారు. వరదయ్యపాళెంతో పాటు సమీపం లోని ఇందిరానగర్, సీఎల్ఎన్‌పల్లె, కడూరు, కాంబాకం, అరుదూరు, కురింజలం, కంచర పాళెం పంచాయతీలను కలుపుతూ వరద య్యపాళెం నగర పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు అధికారులకు నివేదికలను అందించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. కాగా వరదయ్యపాళెంను నగర పంచాయతీగా మార్చేందుకు కేబినెట్‌లో నిర్ణయించిన విషయం తెలిసిందే.

భక్తుల రద్దీ పర్యవేక్షణ



శ్రీకాళహస్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వరుస సెలవలు కావడంతో శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. రద్దీని ఈవో బాపిరెడ్డి పరిశీలించారు. క్యూలైన్ల నిర్వహణపై సంబంధిత అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి భక్తుడికీ స్వామి అమ్మవార్ల దర్శనం సాఫీగా జరిగేలా చూడాలని ఆదేశించారు. క్యూలైన్లలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

● జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివరాం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలు

రేణిగుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని ద్విచక్ర వాహనదారుడు గాయపడ్డాడు. ఈ ఘటన శనివారం తెల్లవారు జామున కొత్త చెక్ పోస్ట్ సమీపంలోని వంతెనపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కడప వైపు నుంచి రేణిగుంట వైపు వస్తున్న కారు అతి వేగంగా వచ్చి ముందుపోతున్న ప్రైవేటు కర్మాగారానికి చెందిన బస్సును ఢీకొంది. ఆ బస్సు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహన దారుడు తీవ్ర గాయాలు పాలయ్యాడు. స్థానికులు అతడిని రుయాసుపత్రికి తరలించారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో స్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలం కరించి వేద మంత్రాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ ఊంజల్ సేవ నిర్వహించారు.

రాయల చెరువు బాధితులకు వితరణ





బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న శంకర్‌రెడ్డి -అంజూరు శ్రీనివాసులు

కేవీబీపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలం లోని పాతపాళెం దళితవాడలో రాయలచెరువు వరదతో నష్టపోయిన దళితులకు టీడీపీ సత్యవేడు నియోజకర్గ అభివృద్ధి సమన్వయకర్త శంకర్‌రెడ్డి బియ్యం, నిత్యావసర వస్తువులు, రూ.3వేలు నగదును పంపిణీ చేశారు.మధ్యాహ్నం కళత్తూరులో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్పంచ్ సురేష్, ప్రకాష్‌నాయుడు, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

●మండల కేంద్రంలోని పీడీఆర్ భారత్‌గ్యాస్ యాజ మాన్యం ధనంజయరెడ్డి తన సొంత నిధులు వెచ్చించి సుమారు 1,500 మందికి ఆహారం అందజేశారు. కళత్తూరులో 1,200మందికి, పాతపాళెంలో 300మందికి ఆహారం అందజేశారు. అరుంధతివాడలో దెబ్బతిన్న కుటుంబాల వారికి బియ్యాన్ని పంపిణీ చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పీడీఆర్ గ్యాస్, పెట్రోల్ బంకు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: ఓళ్లూరు రాయల చెరువు తెగడంతో కళత్తూరు, హరిజనవాడ, పాతపాళెం గ్రామాలకు నీటిముంపు ఏర్పడిన విషయం తెలిసిందే. శనివారం శ్రీకాళ హస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాధితులకు దుప్పట్లు, ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సూరిశెట్టి, సంతన్‌కుమార్, శ్రీవారి సురేష్, డేవిడ్, తేజు, సుధీర్ పాల్గొన్నారు.

కర్షకుడిపై కన్నెర్ర

● మూడేళ్లుగా పులిచెర్ల మండలాన్ని వీడని ఏనుగుల మంద

● సేద్యంపై ఆశ వదులుకుంటున్న రైతులు





ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడిచెట్టు- టమోటా పంట

కల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):అన్నదాతలను గజరాజులు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. పంటలపై దాడులు చేస్తూ వారి కష్టాన్ని పొట్టనబెట్టుకుంటున్నాయి. పలమనేరు కౌండిన్య అటవీ ప్రాంతం నుంచి మూడేళ్ల క్రితం పులిచెర్ల మండలంలోకి చేరుకున్న ఏనుగుల మంద కొన్నాళ్ల పాటు అప్పుడప్పుడూ వచ్చి పంటలను ధ్వంసం చేసి పోయేవి. అయితే ఆరు నెలలుగా మండలంలోనే తిష్ఠ వేసిన ఏనుగుల మంద రోజూ పంటలను ధ్వంసం చేయడం పనిగా పెట్టుకున్నాయి.మండల సరిహద్దులో ఉన్న అటవీ ప్రాంతాలు నివాసానికి అనువుగా ఉండడంతో పగలంతా అడవిలో ఉంటూ రాత్రి వేళ పొలాల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. అటవీ సరిహద్దు ప్రాంతాలైన చల్లావారిపల్లి, పాతపేట, కల్లూరు, పాళెం, దేవళంపేట, కమ్మపల్లి, గడ్డంవారిపల్లి, మంగళంపేట, ఎల్లంకివారిపల్లి, కావేటిగారిపల్లి పంచాయతీల్లో పంటలు ఏనుగుల దాడుల్లో దెబ్బతింటున్నాయి.మండలంలో మామిడి,టమోటా పంటలను రైతులు ఎక్కువగా పండిస్తారు. ఏనుగుల మంద మామిడిచెట్ల కొమ్మలను విరిచేస్తూ టమోటా పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ముప్పై ఏళ్ల వయసున్న కొబ్బరిచెట్లను సైతం కూకటివేళ్లతో పెకలిస్తున్నాయి. ఇక వరి, అరటి, కూరగాయల పంటలనూ నాశనం చేస్తున్నాయి.అసలే సేద్యం గిట్టుబాటు కాక ఇబ్బంది పడుతున్న రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను చేతికొచ్చే సమయంలో ఏనుగుల గుంపు ధ్వంసం చేస్తుండటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలో ఇప్పటికే గజదాడుల్లో 225 హెక్టార్ల వరి, 110 హెక్టార్ల టమోటా, 200 హెక్టార్ల మామిడిపంటలు దెబ్బతిన్నాయి. దీనికితోడు సుమారు 600 కొబ్బరిచెట్లను ఏనుగుల గుంపు కూకటివేళ్లతో పెకలించాయి. పంటలపై ఏనుగుల దాడులతో తీవ్రంగా నష్ట పోతున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు నిట్టూర్పు విడుస్తున్నారు. మండలాన్ని ఏనుగులు వదిలివెళతాయన్న నమ్మకం సన్నగిల్లుతుండడంతో సేద్యంపైనే ఆశలు వదులుకుంటున్నారు.

తూతూమంత్రంగా పరిహారం

గజదాడుల్లో పంటలను కోల్పోతున్న తమకు అటవీశాఖ తూతూమంత్రంగా పరిహారం చెలిస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పొలాల వద్దకు వెళ్లొద్దని హెచ్చరిస్తున్న అటవీశాఖ అధికారులు సరిగా పంట నష్టాన్ని లెక్కకట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బాధిత రైతుల్లో 30శాతం మందికి మాత్రమే నష్ట పరిహారం అందుతోందంటున్నారు.వారికి కూడా పంటల సాగుకు చేస్తున్న ఖర్చులో పదిశాతం కూడా పరిహారంగా ఇవ్వడం లేదంటున్నారు. మిగిలిన రైతులు పరిహారం కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగి తిరిగి ఫలితం లేకపోవడంతో దరఖాస్తు చేసుకోవడమే మానేశామంటున్నారు. ఏనుగుల మంద కట్టడికి ఇటీవల కుంకీ ఏనుగులను పలమనేరుకు తీసుకురావడంతో ఆశలు చిగురించాయని, అయితే కుంకీ ఆపరేషన్‌కు పరిస్థితులు అనుకూలించడం లేదని డీఎఫ్‌వో సుబ్బరాజు చెప్పడంతో ఆ ఆశ కూడా నిరాశగానే మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి

పవన్‌కోసం ఎదురుచూసి...





రాయుడు హత్య కేసులో నిందితులపై చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సోదరి కీర్తి, బంధువులు - తాజ్ హోటల్ వద్ద దివ్యాంగులను ఆపుతున్న పోలీసులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలవాలని ఆశపడ్డ అభిమానులతో పాటు సామాన్య జనానికి నిరాశే ఎదురైంది.మామండూరు అటవీక్షేత్రాన్ని, మంగళం వద్ద ఉన్న ఎర్రచందనం గోదామును పరిశీలించి సాయంత్రం 3గంటలకు కలెక్టరేట్‌కు పవన్ విచ్చేశారు.అప్పటికే గంటల కొద్దీ పలు ప్రాంతాల్లో జనసేన కార్యకర్తలు, అభిమానులతో పాటు పెద్దఎత్తున జనం కూడా ఆయన కోసం ఎదురుచూశారు. తిమ్మినాయుడుపాళెం దళితుల శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు, శ్రీకాళహస్తిలో జనసేన నాయకురాలు వినుత డ్రైవర్ రాయుడిని హత్య చేసినవారిని కఠినంగా శిక్షించాలంటూ మృతుడి సోదరి కీర్తి,బంధువులు ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు.చెరువు కట్ట తెగిపోవడంతో నష్టపోయిన తమను ఆదుకోవాలని కేవీబీపురం మండలం కళత్తూరు దళితవాడవాసులు, తమకు న్యాయం చేయాలని అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామ పంచాయతీ వర్కర్లు పవన్‌కోసం రోడ్డుపై వేచి చూశారు. భద్రతా కారణాల రీత్యా పోలీసులు ఎక్కడికక్కడ రోప్‌పార్టీలను పెట్టి దగ్గరకు పంపకపోవడంతో వారంతా నిరాశపడ్డారు.అంతకుముందు కలెక్టరేట్‌లో పీడబ్ల్యూడీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం ఇచ్చారు.దివ్యాంగులందరికీ రైస్‌కార్డుఇవ్వాలని, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, ఇళ్ల కట్టించి ఇవ్వాలని ఆ సంఘం నేతలు సుబ్రహ్మణ్యం తదితరులు పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు.

డిప్యూటీ సీఎంకు శ్రీశ్రీ రచనల పుస్తకాలు



పవన్ కల్యాణ్‌కు పుస్తకాలను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్ శ్రీశ్రీ రచనలతో కూడిన పుస్తకాలను అందజేశారు. కలెక్టరేట్‌లో సమావేశానికి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. డీఆర్వో నరసింహులుతో కలిసి కలెక్టర్ స్వాగతం పలికారు. పోలీసు జాగిలం పవన్‌కు సెల్యూట్ చేయడంతో తిరిగి ఆయన షేక్ హ్యాండ్ ఇచ్చారు.

రాహుల్‌గాంధీకి ఎన్నికల వ్యవస్థపై అవగాహన లేదు

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్



సమావేశంలో మాట్లాడుతున్న జల్లి మధుసూదన్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీకి ఎన్నికల వ్యవస్థపై అవగాహన లేదని, అందుకే అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ బీజేపీ విజయం సాధించిన ప్రతిసారీ ఈవీఎంలపై ఆరోపణలు చేయడం రాహుల్‌కు పరిపాటి అయిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచినందుకు దేశ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకు పోతోందన్నారు. హర్యానాలో అభివృద్ధి రాహుల్ గాంధీకి కనిపించకపోవడం అవగాహన లోపమని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్రీధర్, పొనగంటి భాస్కర్, జయంత్‌కుమార్, నాగేంద్ర, రాజకుమార్ పాల్గొన్నారు.

భక్త కనకదాసుకు ఘన నివాళి



కనకదాసు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

తిరుపతి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు జయంతి ఉత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కురుబ కుల సేవా సంఘం ప్రతినిధులు ఆర్టీసీ బస్టాండు సమీపంలోని కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. రుయా ఆస్పత్రి వద్ద పేదలకు, అలిపిరి వద్ద కాలినడకన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నంజుండప్ప, వెంకటరమణ, ఆడిటర్ ఆనంద్, నారాయణబాబు, ఆర్టీసీ సుబ్రహ్మణ్యం, ఇంద్రకుమార్, నాగరాజులు, డిల్లీప్రసాద్, భాస్కర్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్యా పోటీలలో 'ట్రెండ్స్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న హెచ్‌ఎం కేశవులనాయుడు

తిరుపతి అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన వృత్తివిద్యా పోటీలలో మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. శనివారం ఉదయం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం కేశవులనాయుడు విజేతలకు జ్ఞాపిక అందజేశారు. పోటీలలో పాల్గొన్న పూజ, దివ్య, లక్ష్మి, శశిప్రియ, జ్యోత్స్న, సింహాద్రి, మహేష్, వరుణ్‌సందేశ్, యశంత్‌సాయిలను అభినందించారు. టీచర్లు సాంబశివరావు, రాజేశ్వరి, స్వాతి, సాయిపవిత్ర పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమం పోస్టరు ఆవిష్కరణ

తిరుపతి(జీవకోన), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ ప్రజాఉద్యమం పేరుతో ఈనెల 12వతేదీన చేపట్టనున్న ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి ఆర్కే రోజా, తిరుపతి ఎంపీ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్, టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, ఎస్సీ విభాగం నేతలు నల్లాని బాబు, తలారి రాజేంద్ర పాల్గొన్నారు.

కిట్టూర్ రాణి చెన్నమ్మ బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం కిట్టూర్ రాణి చెన్నమ్మ బాలికల రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదలైందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. 2014 జూన్ 1 నుంచి 2016 మే 31 మధ్య జన్మించిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. మరిన్ని వివరాలకు, దరఖాస్తులకు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ పోటీ పరీక్షల సమాచార కేంద్రాన్ని 86888 88802 / 93999 76999లలో సంప్రదించాలని కోరారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



రోగులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి (వైద్యం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డయాబెటిక్‌తో బాధపడే వారు మూడు నెలలకొకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని, లేకపోతే దృష్టి లోపం ఏర్పడే అవకాశాలున్నాయని శ్రీసాయిసుధా ఆస్పత్రి ఎండీ డాక్టర్ సుధారాణి అన్నారు. సుధారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక తిలక్ రోడ్డులోని శ్రీసాయిసుధా ఆస్పత్రిలో ఆమె శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 50 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందించారు. కంటి వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించారు. ఆస్పత్రి సిబ్బంది విశ్వనాథం, మహేష్, సునీత పాల్గొన్నారు.

సీతమ్మనగర్ అంశంపై టీజీ వెంకటేష్ వైఖరి సరికాదు

● పామిడి సత్యనారాయణశెట్టి



తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సీతమ్మనగర్ అంశంలో ఆర్యవైశ్య సంఘం నేత, కర్నూలు మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అనుసరిస్తున్న వైఖరి సరికాదని తిరుపతి కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు పామిడి సత్యనారాయణశెట్టి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ టీజీ వెంకటేష్ సీతమ్మనగర్‌లో కబ్జాలను ప్రోత్సహిస్తూ బెదిరింపు చర్యలకు పాల్పడటం శోచనీయమన్నారు. ఆయన ఒక సంస్థను సృష్టించుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ అధ్యక్షుడికే సీతమ్మనగర్‌లో భూములు కౌలుకు కేటాయించే బాధ్యతలు ఉంటాయన్నారు. మానసిక వికలాంగుడైన మాజీ అధ్యక్షుడు పసుమర్తి గోపీనాథ్ వద్ద వెంకటేష్ సంతకాలు చేయించి, రిజిస్ట్రేషన్లు చేయించడం సరికాదన్నారు. వెంకటేష్ బెదిరింపులపై ఎస్పీకి ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

భక్తులతో స్నేహ పూర్వకంగా మెలగండి

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు



ఆటోస్టాండును పరిశీలిస్తున్న కోడూరు బాలసుబ్రహ్మణ్యం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆటోడ్రైవర్లు భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వారిపట్ల స్నేహపూర్వకంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం కోరారు. శనివారం రైల్వే స్టేషన్‌లోని సుదర్శన్ ఆటోస్టాండ్‌ను ఆయన సందర్శించారు. ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైల్వేస్టేషన్ వద్ద కొందరు రోడ్డు ఆక్రమించి నిర్మించుకున్న షాపులతో పార్కింగ్ సమస్య వస్తోందని ఆటోడ్రైవర్లు చెప్పగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కొత్తగా నిర్మితమైన రైల్వేస్టేషన్ భవనాన్ని సందర్శించారు.

డిప్యూటీ సీఎంకు రైతు సమస్యలు పట్టవా?

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు రైతుల సమస్యలు పట్టవా అని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కలెక్టరేట్‌కు వచ్చిన పవన్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూసినా పట్టించుకోకుండా వెళ్లిపోవడం సరికాదని పేర్కొన్నారు. ఈ పర్యటనలో అర్జీలు తీసుకోరని ఉదయమే చెప్పి ఉంటే గౌరవంగా ఉండేదని తెలిపారు. సినిమా నటులు రాజకీయాల్లోకి వస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందని విమర్శించారు.

వైభవంగా సంకటహర చతుర్థి వేడుకలు



తిరుపతి(జీవకోన), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయకసాగర్ వద్ద ఉన్న సంకల్ప వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం సంకటహర చతుర్థి వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు సురేష్‌స్వామి, ధర్మకర్త చెంగారెడ్డి, సభ్యులు గుండాల గోపినాథ్, నాదమునిరెడ్డి, సుధాకర్ ఆచారి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, అన్నారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రసాద్, శాంతిప్రియ, రత్నం, కినిషారెడ్డి, తన్విష్ పాల్గొన్నారు.

బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ



తిరుపతి(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇటీవల నిర్వహించిన బాలోత్సవంలో కొర్లగుంట ప్రైమరీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమానికి ఎంఈవో భాస్కర్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. సబ్ జూనియర్ చెస్ పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్న ఐదవ తరగతి విద్యార్థి బి.శివకుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ముందుడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఎం షేక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేస్త్రీ ఆత్మహత్య



మృతిచెందిన మహేంద్ర

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది మేస్త్రీ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం అర్ధరాత్రి ఆటోనగర్‌లో చోటుచేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి వివరాల మేరకు... ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలానికి చెందిన మహేంద్ర(38) పనుల కోసం తిరుపతికి వచ్చాడు. మేస్త్రీగా పనిచేస్తూ పూలవానిగుంటలో బాబాయి, పిన్ని ఇంట్లో ఉంటున్నాడు. కొన్ని రోజులుగా ముభావంగా ఉంటూ శుక్రవారం రాత్రి పూలవానిగుంటలో స్నేహితుడి ఇంటికి వచ్చాడు. అక్కడ ఇద్దరూ కలసి మద్యం తాగారు. ఉన్నఫళంగా మిద్దెపైకి వెళ్లి మొదటి అంతస్తు నుంచి దూకాడు. చికిత్స నిమిత్తం ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకరించండి

తిరుపతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకరించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కోరారు. శనివారం తిరుపతి పర్యటనకు వచ్చిన పవన్‌ను గిరిధర్ కలిసి వినతిపత్రం అందజేశారు. మూడు దశాబ్దాలకు పైగా బాలాజీ రైల్వే డివిజన్ డిమాండ్ ఉందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పవన్ సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది.

రెడ్‌బుక్‌కు భయపడం : వైసీపీ నేత అంబటి రాంబాబు

తిరుపతి(జీవకోన), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రెడ్‌బుక్‌కు తమ కుక్క కూడా భయపడదని, తాము లెక్కచేయమని వైసీపీ నేత అంబటి రాంబాబు అన్నారు. తిరుపతిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగంపేరుతో లోకేశ్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. అక్రమ కేసులు బనాయించి జైళ్లలో నిర్బంధిస్తున్నారన్నారు. అన్నిటికి సిద్ధపడి వచ్చామని దేనికి భయపడమన్నారు.

జర్నలిజం పేరుతో

ఉద్యోగులను వేధిస్తే చర్యలు

● చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జర్నలిజం పేరుతో ఉద్యోగులను వేధిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేసినట్లు ఫిర్యాదులు అందిన ఒక విలేకరి అక్రిడిటేషన్ కార్డును రద్దు చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడటం, వారిని బ్లాక్ మెయిల్ చేయకుండా కార్యాలయంలో నిర్భయంగా పనిచేసే వాతావరణం కల్పించడం తన బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఇద్దరు పాత్రికేయులు మహిళా ఉద్యోగులతో సహా ప్రభుత్వ ఉద్యోగులను పదేపదే బ్లాక్ మెయిల్ చేశారని, బెదిరించడానికి ప్రయత్నించారనేది తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారించి, ఆ ఇద్దరిలో ఒకరి అక్రిడిటేషన్ కార్డును రద్దు చేశామన్నారు. పౌరులు, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కలెక్టర్ వ్యాఖ్యలపై నిరసన

తిరుపతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కలెక్టర్ వ్యవహారశైలిపై శనివారం తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. వార్తలు రాసే జర్నలిస్టులను లేపేస్తామని బెదిరించడమేమిటనిప్రశ్నించారు. రాజ్యాంగ హక్కులను కాలరాసే అధికారం ఎవరిచ్చారని మండిపడ్డారు. కలెక్టర్ చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని విలేకర్లపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండు చేశారు. గాంధీ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ప్రసాద్, జనార్దన్, మురళి, బాలు, రాజేంద్ర, శీనుబాబు, రాఘవ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





హర్దీప్ సింగ్ పూరి - ఆర్కే రోజా - కుటుంబ సభ్యులతో అర్జున్ - ప్రియ - మాన్య



జస్టిస్ సుధీర్ కుమార్


శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదీర్ కుమార్, రాష్ట్ర మాజీ మంత్రి ఆర్కే రోజా ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే సినీ హీరో అర్జున్, నివేదిత దంపతులు, వారి కుమార్తెలు హీరోయిన్ ఐశ్వర్య, అంజన, నటి ప్రియ, గాయని మాన్య కూడా తిరుమలేశుడ్ని దర్శించుకున్నారు. దర్శనానంతరం హీరో అర్జున్ మీడియాతో మాట్లాడారు.. తాను నిర్మాత, దర్శకుడిగా వ్యవహరించి చిత్రీకరించిన 'సీతా పయణం' చిత్రం వచ్చే నెలలో విడుదలవుతుందన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,075
తలనీలాలు సమర్పించినవారు: 26,535



కుప్పం @ ఇండస్ట్రియల్ హబ్

- రూ.2,203 కోట్ల పెట్టుబడితో 7పరిశ్రమలకు సీఎం శంకుస్థాపన
- 22వేలమందికి ఉపాధి అవకాశాలు

హిందాల్కో కంపెనీ శంకుస్థాపన సందర్భంగా ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, హాజరైన కలెక్టర్ తదితరులు





కుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం యువత కలలు పండనున్నాయి.వలసలను ఆపి ఉపాధి అవకాశాలను పుష్కలంగా పెంచే జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు ఇక్కడకు తరలి వస్తున్నాయి.కుప్పంలో ఏకంగా ఏడు పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.రూ.2,203 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమలతో 22వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రకటించారు. రాబోయే మూడు నెలల కాలంలో రూ.6,630 కోట్లతో మరో 8 పరిశ్రమలు తెస్తామని, వీటి ద్వారా ఏకంగా 43 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు.శంకుస్థాపన కార్యక్రమంలో కుప్పంనుంచి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్,ఆయా కంపెనీల సీఈవోలు, ఇతర ముఖ్య ప్రతినిధులు,ప్రజాప్రతినిధులు, అధికార కూటమి పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయాధారిత పరిశ్రమలే అధికం

కుప్పంలో ఏర్పాటు కాబోయే 7 పరిశ్రమల్లో వ్యవసాయ, పాడి ఆధారిత పరిశ్రమలే అధికం. శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో స్థాపించనున్న మదర్ డెయిరీ ఫ్రూట్ పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్, గుడుపల్లె మండలం పొగురుపల్లెలో ఏర్పాటు చేయనున్న శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఎడిబుల్ ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రెడియంట్స్ యూనిట్లు వ్యవసాయ, పాడి ఆధారిత పరిశ్రమలే. మదర్ డెయిరీ ఫ్రూట్‌పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్‌కు 41.22 ఎకరాలు, శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌కు చెందిన డెయిరీ రిలేటెడ్ ప్రొడక్ట్స్ ప్రాసెసింగ్ అండ్ అనిమిల్ ఫీడ్‌కు 47.49 ఎకరాలు, ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్‌కు 18.68 ఎకరాలు, ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రెడియంటక్స్‌కు 73.63 ఎకరాల భూమిని కేటాయించారు. అలాగే కుప్పం పురపాలక సంఘ పరిధిలోని పల్లార్లపల్లె వద్ద ఏర్పాటు కానున్న అలీప్ పరిశ్రమకు చెందిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ ఉమెన్ గ్రీన్ అండ్ సస్టెనబుల్ ఇండస్ట్రియల్ పార్క్ (మహిళా శక్తి భవన్)కోసం 18.7 ఎకరాలు, రామకుప్పం మండలం విజలాపురం వద్ద ఏర్పాటు కానున్న ఈ-రాయిస్ మోటార్స్ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ వెహికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 25 ఎకరాలు, హిండాల్కర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఇంటిగ్రేటెడ్ అల్యూమినియం ఎక్స్‌ట్రక్షన్ ఫ్యాక్టరీకి 16.3 ఎకరాల కేటాయింపు జరిగింది. ఈ మొత్తం పరిశ్రమల స్థాపనవల్ల ప్రత్యక్షంగా 7,093 మందికి, పరోక్షంగా 15,237 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పన సాధ్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కంపెనీ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి కల్పన	
		డైరెక్ట్	ఇన్‌డైరెక్ట్
అలీప్	26.7	1,000	2,500
మదర్ డెయిరీ	260	850	3,150
ఏస్ ఇంటర్నేషనల్	525	2,000	5,000
ఈ-రాయిస్ మోటార్స్	200	280	130
శ్రీజ మిల్క్	233	850	3,150
హిండాల్కో ఇండస్ట్రీస్	586	613	307
ఎస్వీఎఫ్ సోయా	372.8	1,500	1000

తిరుమలలో నేడు కార్తీక వనభోజనం

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కార్తీక వనభోజన కార్యక్రమానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఏటా కార్తీకమాసంలో పాపవినాశన మార్గంలోని పార్వేట మండపంలో ఈకార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో ఆదివారం ఉదయం మలయప్పస్వామి చిన్న గజవాహనంపై, ఉభయనాంచారులు పల్లకీపై బయలుదేరి ఊరేగింపుగా పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వనభోజనం కార్యక్రమం జరుగుతుంది. మండపం సమీపాన అటవీప్రాంతంలో ఉన్న భక్తులందరికీ అన్నప్రసాదాలను అందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక క్యూలైన్లు, షెడ్లు ఏర్పాటు చేశారు. వనభోజన కార్యక్రమం నేపథ్యంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

కల్యాణకట్ట, లడ్డూకౌంటర్ల వద్ద హెల్ప్ డెస్కులు

- అధికారులకు అదనపు ఈవో ఆదేశం



తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కల్యాణకట్ట, లడ్డూ కౌంటర్ల వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. పద్మావతి అతిథిగృహంలో శనివారం ఆయన అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా గత నెలలో భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపై చర్చించారు. కాలిబాట మార్గాల్లో ఎస్టేట్, హెల్త్ విభాగాలు తరచూ తనిఖీలు నిర్వహించాలని, దుకాణాల్లో వస్తువుల ధరలను పర్యవేక్షించాలన్నారు. అన్నప్రసాద భవనంలో చేతులకు తొడుగులు ధరించి ప్రసాదాలు వడ్డించాలని సిబ్బందికి సూచించారు. లగేజీ కౌంటర్ వద్ద భక్తులకు సకాలంలో లగేజీ అందేలా సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలన్నారు. ఏటీసీ నుంచి అక్టోపస్ సర్కిల్ వరకు క్యూలైన్లలో అన్నప్రసాదం, తాగునీరు అందేలా చూడాలన్నారు. భక్తుల అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కాగా గోపార్క్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి పార్కింగ్ సమస్యల పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు సమావేశంలో డిప్యూటీఈవోలు లోకనాథం, రాజేంద్ర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

19న స్వర్ణముఖి నదీ హారతులు

శ్రీకాళహస్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నెల 19వ తేదీ బుధవారం స్వర్ణముఖి నదీ హారతులు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అష్టోత్తర శత కలశాభిషేకం, బిల్వ నిమజ్జనం, స్వర్ణముఖి నదీ హారతులు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో రాహుకేతు పూజలు మినహా మిగిలిన అన్ని ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు.



గోదాములో 'ఎర్ర బంగారం'

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్య

మంగళం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గోదాములో ఉండేది 2.6 లక్షల ఎర్రచందనం దుంగలు. వీటి విలువ దాదాపు రూ.పది వేల కోట్లు. ఈ గణాంకాలు తెలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశ్చర్యపోయారు. గోదాములో 'ఎర్ర బంగారం' నిల్వ చేసినట్లుంది అంటూ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన తిరుపతి నగరం తిమ్మినాయుడుపాళెం వద్ద గల ఎర్రచందనం కేంద్ర గోదామును పరిశీలించారు. ఈ దుంగలు ఎంత పటిష్టంగా ఉంటాయో తెలుసుకోవడానికి సుత్తి తీసుకుని కొట్టి పరీక్షించారు. ఏ, బీ, సీ, నాన్ గ్రేడ్‌గా వర్గీకరించిన దుంగలు, బై ప్రొడక్ట్స్‌ను పరిశీలించారు. ఒక చెట్టును రెండునుంచి మూడు దుంగలుగా స్మగ్లర్లు నరుకుతారని అధికారులు తెలిపారు. ఈ లెక్కన శేషాచల కొండల్లో తెలిసి రెండు లక్షల చెట్లను నరికేస్తే.. తెలియకుండా ఇంకెంత నరికేశారోనని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడున్న దుంగలను ఎత్తుకుని వాటి బరువు పరిశీలించారు. గ్లోబెల్ టెండర్లు నిర్వహిస్తున్న సమయంలో చూపించేది ఒకటి.. వారికి ఇస్తున్నది మరొకటన్న అపవాదు ఉందని అడగ్గా.. అందుకు అవకాశంలేదని అటవీశాఖ అధికారులు సమాధానమిచ్చారు. దుంగలు పట్టుబడగానే గ్రేడ్లుగా విభజించి నంబరింగ్ చేస్తామని, వాటిని మార్చడం జరగదన్నారు. కొనుగోలుదారులు ఎంపిక చేసుకున్న వాటినే ఇవ్వాలని పవన్ స్పష్టంచేశారు. బైప్రోడక్ట్ తీసుకున్నవారు ఎందుకువినియోగిస్తారు వీటితో ఏం చేస్తారని ఆసక్తిగా తెలుసుకున్నారు. ప్రస్తుతం గోదాములో 5,300 టన్నుల ఎర్రచందనానికి ఏడాదికి దాదాపు పదివేలకోట్లకు గాను రూ.1.28కోట్లు బీమా చేసినట్లు అధికారులు చెప్పారు. దాదాపు 45నిమిషాల పాటు ఎనిమిది గోదాములను చూశారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ చలపతిరావు, ప్రభుత్వ అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఓఎస్డీ శివరాంప్రసాద్, సీసీఎఫ్ సెల్వం, తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా, సెంట్రల్ గోదాము డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మామండూరులో పవన్

- అరుదైన మొక్క నాటిన డిప్యూటీ సీఎం

తిరుపతి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మామండూరు అటవీ ప్రాంతాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం సందర్శించారు. అడవిలో నాలుగు కిలోమీటర్లుపైగా ప్రయాణించారు. ఇందులో రెండు కిలోమీటర్ల మేర నడుస్తూ ప్రతి చెట్టునూ పరిశీలించారు. ఎర్రచందనం, అంకుడు, తెల్లమద్ది, వెదురుతో పాటు శేషాచలంలో మాత్రమే కనబడే అరుదైన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాచ్ టవర్ నుంచి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. వెలిగొండ, శేషాచలం అటవీ సరిహద్దుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్వర్ణముఖీ నది ఎక్కడి నుంచి ఉద్భవిస్తుందనే వివరాలూ అడిగారు. మామండూరు రిజర్వ్ ఫారెస్ట్ ప్రధాన వేదిక సమీపంలో జీవవైవిధ్యం కలిగిన 61 మొక్కలను ఏర్పాటుచేశారు. ఇందులో అండమాన్ నుంచి తెప్పించిన అండమాన్ సైకస్, సైకస్ స్ఫీరికా (జామంతి చెట్టు)మొక్కలను నాటి నీరు పోశారు. గాలిబుడగ, చింతచిల్లి, తూరిపూవు ఎర్రగించ గడ్డి, ఆఫ్రికా మహాగని, సముద్ర జడి, సింధూర చెట్టు, గుగ్గిలం, గురివింద వంటి మొక్కలను అక్కడ అధికారులు నాటారు. బయో డైవర్సిటీ హాట్‌స్పాట్‌గా పిలిచే దీనిని మియావాకి ఫారెస్టుగా మారుతుందని అధికారులు చెప్పారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ రాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, ఇతర అటవీ అధికారులు ఉన్నారు. మామండూరుకు పవన్ వస్తున్నారని తెలిసి జనసేన శ్రేణులతో పాటు స్థానిక కూటమి నాయకులు అక్కడకు చేరుకున్నారు. అయితే అధికారులు రిజర్వ్ ఫారెస్ట్ ప్రధాన గేటు లోపలకు మాత్రమే కొందరు నాయకులకు అనుమతించి.. లోపలికి వెళ్లకూడదని ఆంక్షలు పెట్టారు. దీంతో నాయకులు కొంతసేపు వేచివుండి పవన్ రాక ముందే తిరిగి వెళ్లిపోయారు. అభిమానులనూ పోలీసులు అనుమతించలేదు.

'ఎర్ర' స్మగ్లింగ్‌ను అరికట్టడమే లక్ష్యం

- స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు... థర్మల్ డ్రోన్ల ద్వారా నిఘా
- అధికార యంత్రాంగానికి డిప్యూటీ సీఎం ఆదేశం

తిరుపతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్‌లో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, అటవీ, పోలీసు, టాస్క్‌ఫోర్స్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అడిషనల్ జాయింట్ పెట్రోలింగ్ క్యాంపులు, చెక్‌పోస్టులు, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు. ఇకపై అక్రమ రవాణా చేయాలంటే భయపడేలా చర్యలుండాలని స్పష్టం చేశారు. అటవీ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. శేషాచల అడవుల నుంచి కూలీలు, మేస్త్రీలు, లాజిస్టిక్స్ సపోర్టర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, గోడౌన్ కీపర్లు, ఎక్స్‌పోర్టుల ద్వారా ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్లకు చేరుతోందని అధికారులు వివరించారు. 2004 నుంచి ఇప్పటి వరకు 14,204 టన్నుల ఎర్రచందనం దుంగలు, 10,450 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని అటవీ, పోలీసు అధికారులు వివరించారు. 16,985 కేసులు నమోదుచేసి 32,345 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ పి.వి.చలపతిరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, అనంతపురం, కర్నూలు కన్జర్వేటర్లు యశోదాబాయి, కృష్ణమూర్తి, చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్, కడప ఎస్పీ విశ్వనాథ్, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.





ఒకే వేదికపై తండ్రీ కొడుకులు

ఒకరు డిప్యూటీ సీఎం పవన్ వ్యక్తిగత కార్యదర్శి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ జి.ఆర్.మధుసూదన్. మరొకరు తిరుపతి అర్బన్ తహసీల్దారు రామచంద్ర. వీరిద్దరూ తండ్రీ కొడుకులు. శనివారం పవన్ పర్యటనలో.. విధి నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లో తండ్రి జి.రామచంద్ర.. కుమారుడు మధుసూదన్ ఒకే వేదికపైకి చేరారు. వీరిద్దరితో పవన్‌కల్యాణ్ ఫొటోదిగి అభినందించారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

భక్త కనకదాసుకు నివాళి

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భక్తకనకదాసు 538 జయంత్యుత్సవాలు శనివారం కలెక్టరేట్‌లో జరిగాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కవి, గాయకుడు, రచయిత, సంఘసంస్కర్తగా సమాజంలో నెలకొన్న అనేక దురాచారాలను దూరంచేయడానికి కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు, బీసీ సంక్షేమశాఖ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, జ్యోత్స్న, జిల్లా కురబసంఘం నాయకులు పాల్గొన్నారు.



తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

తిరుపతి(నేర విభాగం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తప్పి పోయిన వృద్ధుడిని శనివారం తిరుపతి కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీవారి దర్శనార్థం మన్యం జిల్లా పర్వతీపురానికి చెందిన నల్ల గంగునాయుడు(72) డిసెంబరు 28న కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద తప్పిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సంప్రదించగా, సిబ్బంది సీసీటీవీ దృశ్యాలు పరిశీలించారు. ఆయన విష్ణు నివాసం నుంచి బయటకు వెళ్ళినట్లు గుర్తించారు. ఆయన ఫొటో, వివరాలను కమాండ్ కంట్రోల్ సిబ్బంది వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సెక్యూరిటీ దేవేంద్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కాల్ చేసి, ఆ వృద్ధుడు ఆఫీస్ సమీపంలో తిరుగుతున్నట్లు సమాచారమిచ్చారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు నల్ల శివకు తెలియజేయగా, వెంటనే కంట్రోల్ రూమ్ చేరుకొని తమ తండ్రిని తీసుకెళ్లారు. పోలీసు సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

వర్షం నుంచి రక్షణగా..

అలిపిరి కాలిబాటలో ఫైబర్ షీట్లతో పైకప్పు ఏర్పాటు

తిరుమల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాలినడకన తిరుమలకు వచ్చే భక్తులకు వర్షం నుంచి ఉపశమనం కల్పించేలా ఫైబర్ షీట్లతో టీటీడీ పైకప్పు ఏర్పాటు చేసింది. సాధారణంగా మొక్కులున్న భక్తులు శ్రీవారిమెట్టు మార్గానికంటే అలిపిరి కాలినడక మార్గాన్నే అధికంగా వినియోగిస్తారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం (ఎన్ఎస్ టెంపుల్) నుంచి మోకాళ్లమెట్టు వరకు రోడ్డు వెంబడే ఉన్న నడకమార్గంలో కొంతభాగం పైకప్పు లేదు. దీంతో ఎండ, వర్షం సమయాల్లో భక్తులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత వేసవిలో ఎండ నుంచి ఉపశమనం కల్పించేలా పైభాగంలో తాత్కాలికంగా రేకులు వేసి పచ్చటి వస్త్రంతో పైకప్పును ఏర్పాటు చేశారు. ఇటీవల భారీ వర్షాలకు తాత్కాలిక పైకప్పు లీకవడంతో భక్తులు తడిచిముద్దయ్యారు. ఈ క్రమంలో తొలిసారిగా దాదాపు కిలోమీటరున్నర దూరం పాటు తెల్లటి ఫైబర్ షీట్లతో పైకప్పును ఏర్పాటు చేశారు.



ఇమామ్ జీవితం ఆదర్శప్రాయం


- ఇమామ్ గ్రంథావిష్కరణ కార్యక్రమంలో సజ్జల



ఇమామ్ ప్రస్థానం గ్రంథావిష్కరణ చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, అంబటి రాంబాబు, ఆర్కే రోజా, నారాయణస్వామి, ఇమామ్ తదితరులు

తిరుపతి(జీవకోన), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇమామ్ జీవితం ఆదర్శప్రాయమని, మానవత్వం మరచిపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం తిరుపతిలోని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నివాసం దగ్గర ఇమామ్ గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకుల బాధ్యత, కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్న వ్యక్తుల్లో ఇమామ్ అరుదైన వారని అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ 53 ఏళ్లుగా ఇమామ్ తెలుసునని, తనతో పాటు జైలు జీవితం కూడా గడిపారని గుర్తు చేసుకున్నారు. సభాధ్యక్షుడు భూమన్ మాట్లాడుతూ రాయలసీమ ఉద్యమంలో ఇమామ్ కీలకపాత్ర పోషించారన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇమామ్ లాంటి వ్యక్తులు వైసీపీకి అండగా నిలవాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ ఇమామ్ అంటే మత గురువు అని, మొదట మిత్రుడిగా పరిచయమై తర్వాత గురువవుతారని అన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇమామ్ గొప్పతనాన్ని అందరికీ చాటాలన్నారు. అనంతరం ఇమామ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

నయా బ్రేస్‌లెట్ ట్రెండ్స్



ఆధునిక ఫ్యాషన్ దుస్తులకు అనుగుణంగా రకరకాల బ్రేస్‌లెట్స్ ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. చేతికి సింగిల్ బ్యాంగిల్ వేసుకోవడం కంటే చక్కని బ్రేస్‌లెట్ పెట్టుకోవడానికే యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. సంప్రదాయ దుస్తుల మీద కూడా బ్రేస్‌లెట్స్‌నే ఎంపిక చేసుకుంటున్నారు. మధ్యవయసు మహిళలు సైతం ఈ నయా ట్రెండ్‌ను అనుసరించడం విశేషం.

నల్ల పూసలతో



కొత్తగా పెళ్లయిన యువతులు మెడలో వేసుకునే నల్లపూసల గొలుసును చేతికి బ్రేస్‌లెట్‌లా కూడా పెట్టుకుంటున్నారు. మహిళల ఇష్టాన్ని దృష్టిలో ఉంచుకుని డిజైనర్లు మల్టీపర్పస్ డిజైన్లను రూపొందిస్తున్నారు. బంగారం లేదా వెండితో తయారుచేసిన నల్ల పూసల బ్రేస్‌లెట్స్‌కు అదృష్ట రత్నం, తమ పేరు లేదా భర్త పేరులోని మొదటి అక్షరం, చిన్న చిన్న బుట్టలు, మువ్వలు, లవ్ సింబల్, నచ్చిన బొమ్మలను జతచేయించుకుని మురిసిపోతున్నారు అమ్మాయిలు. నల్లపూసలు కూర్చి రెండు, మూడు వరుసలతో తీర్చిదిద్దిన స్టయిలిష్ బ్రేస్‌లెట్స్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి.

సంప్రదాయికంగా

అన్ని ఆభరణాల్లాగే బ్రేస్‌లెట్‌కూ ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నారు నేటి మహిళలు. మెడలో ధరించిన హారం లేదా నెక్లెస్, చెవులకు పెట్టుకున్న జుంకాలు, వేళ్ల ఉంగరాలతో మ్యాచ్ అయ్యే డిజైన్లను ఎంపిక చేసుకుంటున్నారు. బంగారం, వెండి, ప్లాటినం, వజ్రాలు, కెంపులు, పచ్చలు, ముత్యాలు, బీడ్స్, క్రిస్టల్స్‌తో రూపొందించిన బ్రేస్‌లెట్స్‌ను యువతులు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. చిన్న ముత్యాలతో రూపొందించిన మల్టీ లేయర్ బ్రేస్‌లెట్స్‌కు ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉంది.



ఆధునికంగా

జీన్స్, టీ షర్ట్‌లు, స్కర్టుల మీద సూటయ్యేలా ఊలు దారాలతో తయారుచేసిన డిజైన్లకు కూడా అధికంగా ఆదరణ లభిస్తోంది. నాలుగైదు వరుసల్లో చేతికి నిండుదనాన్నిచ్చే సరికొత్త బ్రేస్‌లెట్స్.. అన్ని వర్గాలవారినీ ఆకర్షిస్తున్నాయి. డ్రెస్ స్టయిల్‌కు తగ్గట్టు.. దారాల అల్లికల మధ్య గవ్వలు, రంగురంగుల పూసలు, ఒకప్పటి నాణేలు, మెరిసే రాళ్ల కూర్చిన బ్రేస్‌లెట్స్‌ను ధరించడం ఫ్యాషన్‌గా మారింది. చిన్న పార్టీలు, వేడుకల్లో పూల డిజైన్లతో కూడిన కఫ్ బ్రేస్‌లెట్స్ ధరించి యువతులు, మధ్య వయసు మహిళలు సందడి చేస్తున్నారు.



ఆరోగ్యానికి కూడా



చేతి మణికట్టుకు పెట్టుకునే బ్రేస్‌లెట్ అందాన్నే కాదు ఆరోగ్యాన్ని కూడా అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. రాగి తీగలతో తయారుచేసిన బ్రేస్‌లెట్ పెట్టుకోవడం వల్ల కీళ్ల నొప్పులు తగ్గుతాయి. శరీరంలో రక్త ప్రసరణ తీరు మెరుగుపడుతుంది. వెండి బ్రేస్‌లెట్ పెట్టుకుంటే మానసిక ఆందోళన తగ్గుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. బంగారు బ్రేస్‌లెట్ పెట్టుకుంటే శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. ఒత్తిడి తగ్గుతుంది. చేతికి ఎలాంటి బ్రేస్‌లెట్ పెట్టుకున్నా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆక్యుప్రెషర్ పాయింట్లు ఉత్తేజితమై గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.

మొక్కలు ఎండిపోతున్నాయా?

మనం కుండీల్లో రకరకాల మొక్కలు పెంచుతూ ఉంటాం. వాటికి రెండుపూటలా నీళ్లు పోస్తూ సమయానుసారం ఎరువులు అందిస్తూ ఎండ తగిలేలా చూసుకుంటూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటాం. అయినా కూడా మొక్కలు ఎండిపోతూ ఉంటాయి. అలాకాకుండా మొక్కలను ఎలా సంరక్షించుకోవాలో తెలుసుకుందాం...

- చాలామంది.. మొక్కలు బాగా ఎదగాలనే భావనతో కుండీల నిండుగా నీళ్లు పోస్తూ ఉంటారు. దీంతో మట్టి పూర్తిగా నీటితో నిండి గాలి ప్రసరణను అడ్డుకుంటుంది. వేర్లకు తగినంత ఆక్సిజన్ అందకపోవడంతో క్రమంగా మొక్కలు ఎండిపోతుంటాయి. కుండీల్లో మట్టి పొడిగా ఉన్నప్పుడు మాత్రమే కొద్దికొద్దిగా నీటిని చిలకరించడం మంచిది. కుండీల అడుగుభాగంలో తప్పనిసరిగా రంధ్రాలు చేయాలి. అప్పుడే కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా బయటికి వెళుతుంది. మొక్కలు పచ్చగా ఎదుగుతాయి.
- కొన్ని రకాల మొక్కలు పెరగడానికి ఎండ కావాలి. మరికొన్ని మాత్రం నీడలోనే ఎదుగుతాయి. ముందుగా మొక్కల తత్వాన్ని తెలుసుకుని కుండీలను ఎక్కడ ఉంచాలో నిర్ణయించాలి. మనీ ప్లాంట్, స్నేక్ ప్లాంట్ లాంటివి నీడలోనే చక్కగా పెరుగుతాయి.



వాటికి ఎండ తగిలితే వెంటనే ఆకులు ఎండిపోతాయి. సక్యులెంట్స్, మందారం, ఆర్కిడ్స్ లాంటి మొక్కల కుండీలను రోజూ కాసేపు ఎండలో ఉంచాలి. మొక్కలు ఎండిపోతున్నట్లు కనిపించగానే కుండీలను స్థలం మార్చడం మంచిది.

- కొన్ని మొక్కలు వేగంగా పెరుగుతుంటాయి. వాటికి తగ్గట్టు కుండీలు పెద్దగా లేని పక్షంలో కావాల్సినన్ని పోషకాలు అందక, పెరిగే వేర్లకు స్థలం సరిపోక మొక్కలు ఎండిపోతాయి. మొక్కలు సరిగా ఎదగడంలేదని గమనించిన వెంటనే వాటిని పెద్ద కుండీల్లోకి మార్చాలి.
- మొక్కల పెరుగుదలకు ఎరువులు తప్పనిసరి. రసాయనాలతో కూడిన ఎరువులు కాకుండా కంపోస్టు, ఆవుపేడ, పండ్ల తొక్కలు, వంటింటి వ్యర్థాలను మట్టిలో చేరుస్తూ ఉంటే మొక్కలు ఎండిపోకుండా పచ్చగా ఎదుగుతాయి.

ప్రేక్షకులకు నచ్చితేనే భవిష్యత్తు

'భీమ్లానాయక్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన సంయుక్తా మేనన్... 'బింబిసార', 'విరూపాక్ష' తదితర చిత్రాలతో విలక్షణ నటిగా గుర్తింపు పొందారు. 'అఖండ తాండవం' లాంటి తెలుగు సినిమాలతో పాటు ఇతర భాషా చిత్రాలతోనూ బిజీగా ఉన్న ఆమె... తన గురించి, తన కెరీర్ గురించి 'నవ్య'తో ప్రత్యేకంగా మాట్లాడారు.



మీరిప్పుడు ఎలాంటి పాత్రల్లో నటిస్తున్నారు?

నేను పోషిస్తున్న పాత్రలన్నీ వేటికవే ప్రత్యేకమైనవి. 'బ్లాక్ గోల్డ్' సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించాను. ప్రస్తుతం పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో నా పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. అలాగే 'అఖండ తాండవం'లో కూడా నా పాత్ర వినూత్నంగా ఉండబోతోంది. ఇన్ని వైవిధ్యమైన పాత్రల్లో ఇమిడిపోగలుగుతానని నేను కూడా అనుకోలేదు. కానీ ప్రతి పాత్రనూ ఆస్వాదిస్తాను. ఒక పాటలో భాగంగా చక్కని డాన్స్‌ను ప్రదర్శించవలసి వచ్చినా, సన్నివేశంలో భాగంగా భావోద్వేగాలను ప్రదర్శించవలసి వచ్చినా... పూర్తి ప్రతిభను కనబరచడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను.

ఇన్ని భిన్నమైన పాత్రల్లో నటించడం, వరుస షూటింగ్‌లు.. ఇదంతా మీకు కష్టంగా ఉంటుందా?

లేదు. నేనెప్పుడూ అలా అనుకోను. చేస్తున్న పనిని ప్రేమించడం నా నైజం. మక్కువ కలిగిన పని చేసేటప్పుడు ప్రతి క్షణం ఆనందాన్ని అనుభవిస్తాం. ఆ పని శ్రమలా తోచదు. ఒక్కో రోజు షూటింగ్‌తో ఒంట్లో ఉన్న శక్తినంతా ఖర్చు చేయాల్సిన అవసరం ఉందనిపిస్తుంది. కానీ షూటింగ్ ముగించుకుని, సాయంత్రం జిమ్‌లో వ్యాయామం చేసి, ఇంటికి వచ్చి, గంట సేపు పెంపుడు కుక్కలతో ఆడుకున్న తర్వాత కూడా... అలసిపోయిన భావన కలగదు.

మీరు ఎక్కడికి వెళ్లినా... పెంపుడు కుక్కలను కూడా వెంటబెట్టుకు వెళ్తూ ఉంటారా?

నాకు మూడు పెంపుడు కుక్కలున్నాయి. నోవా, ఆర్య, రుద్ర వాటి పేర్లు. మూడు భిన్నమైన కుక్కలే! మూడిటిలో రుద్ర పెద్దది. 45 కిలోల బరువు ఉండే రుద్ర... నా మీదకు దూకేసి ఆటలాడే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. మేము మా పెంపుడు కుక్కలను కూడా కుటుంబ సభ్యుల్లాగే పరిగణిస్తాం.

సినీనటిగా, కథానాయికగా ఎదుగుతానని చిన్నప్పుడు అనుకున్నారా?

లేదు. ఎప్పుడూ అనుకోలేదు. నాకసలు అలాంటి ఆలోచనే ఉండేది కాదు. ఇదంతా విధి ఫలితమే! నేను కేరళలోని ఒక అందమైన గ్రామంలో పుట్టాను. ఆ గ్రామం కేరళ, తమిళనాడు సరిహద్దులో ఉంది. అంత మారుమూల గ్రామం నుంచి సినీ రంగంలోకి ప్రవేశించే మార్గమే లేనప్పుడు, దాని గురించి ఆలోచించే అవకాశం కూడా ఉండదు కదా? కాబట్టి బాగా చదువుకొని, డాక్టరు కావాలని కోరుకునేదాన్ని. ప్రపంచమంతా చుట్టి రావాలని అనుకునేదాన్ని. బడిలో చదువుకునే రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనేదాన్ని. పుస్తకాలు ఎక్కువగా చదివేదాన్ని. చిన్మయ స్కూల్‌లో చదివే రోజుల్లో వేదాలతో పరిచయం ఏర్పడింది. నేను పెద్దయ్యాక నటిని అవుతానని నా కుటుంబం, స్నేహితులు, బంధువులు ఎవరూ ఊహించలేదు.

ఖాళీ సమయాల్లో ఏం చేస్తారు?



నేను పుస్తకాలు ఎక్కువగా చదువుతాను. షూటింగ్‌లో ఖాళీ ఉంటే.. 'కిండిల్'లో పుస్తకాలు చదువుతాను. ఖాళీ సమయాల్లోనే కాదు, సంతోషంగా ఉన్నా, విచారంగా ఉన్నా, ప్రయాణం చేయవలసివచ్చినా పుస్తకాలనే ఎంచుకుంటాను.

సినిమాల్లోకి ఎలా ప్రవేశించారు?

యాదృచ్ఛికంగా జరిగింది. ఇంటర్ పూర్తయ్యాక కాలేజీలో చేరాలని అనుకుంటూ ఉండేదాన్ని. మా గ్రామ ప్రజలు కొన్ని వార్షిక సంచికలు ముద్రించేవారు. గ్రామీణుల కథలు, అనుభవాలు వాటిలో ప్రచురితమవుతూ ఉండేవి. ఒక సందర్భంలో ఆ సంచిక ముఖ చిత్రం కోసం వాళ్లు నన్ను సంప్రతించారు. నా ఫొటో ఆ సంచిక ముఖ చిత్రంగా అచ్చయింది. అలాగే నేను సందర్శించే ఒక బ్యూటీ పార్లర్... పాలక్కాడ్‌లో బ్యుటీషియన్స్ కోసం ఒక మేకప్ సెమినార్‌ను నిర్వహించింది. ఆ సెమినార్‌కు ఒక సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ ఆధ్వర్యం వహించింది. ఆ ఆర్టిస్ట్‌కు మోడల్‌గా వ్యవహరించవలసిన అమ్మాయి సమయానికి సెమినార్‌కు చేరుకోలేకపోయింది. దాంతో మా అమ్మ బలవంతం మీద... నేను మోడల్‌గా వ్యవహరించవలసి వచ్చింది. అప్పుడు నన్ను పోర్ట్‌ఫోలియో తయారుచేసుకోవాలనీ, మోడలింగ్ అవకాశాల కోసం ప్రయత్నించాలనీ ఆ మేకప్ ఆర్టిస్ట్ సలహా ఇచ్చింది. ప్రొఫెషనల్ మేకప్‌లో నేను భిన్నంగా కనిపిస్తున్నట్టు మొదటిసారిగా గ్రహించాను. ఆ తర్వాత ఆ మేకప్ ఆర్టిస్ట్, నేనూ ఫేస్‌బుక్ ఫ్రెండ్స్‌గా మారిపోయాం. 'వనిత' అనే మ్యాగజైన్‌కు ఫొటోగ్రాఫర్‌గా వ్యవహరించే ఒక వ్యక్తి... ఓనమ్ పండుగ కోసం నన్ను ఫొటోషూట్ చేస్తానని అడిగారు. ఆ ఫొటోలు పబ్లిష్ అయిన తర్వాత, నాకు సినిమా అవకాశాలు రావడం మొదలుపెట్టాయి. అప్పటివరకూ నాకు సినీ వాతావరణం గురించి ఏమాత్రం తెలీదు. షూటింగ్‌లు ఎలా జరుగుతాయో, లొకేషన్లు ఎలా ఉంటాయో కూడా తెలీదు. అయితే రెండో సినిమా తరువాత... ఈ రంగంతో ప్రేమలో పడిపోయాను. అనంతరం గొప్ప దర్శకుల దర్శకత్వంలో రూపొందిన అంతర్జాతీయ సినిమాలు చూశాను. గొప్ప నటుల ప్రతిభను అర్థం చేసుకుకోవడానికి, నటిగా నన్ను నేను ఆవిష్కరించుకోవడానికి ప్రయత్నించాను. అయితే నాలోని నటిని వెలికి తీయడానికి తగిన దర్శకుడు, తగిన కథ, తగిన సహనటులు అవసరమనే విషయాన్ని కూడా గ్రహించాను. అలా అంశాలన్నీ అనుకూలించినప్పుడు, కచ్చితంగా నటనా ప్రతిభను చాటుకోవచ్చని నేను నమ్ముతాను. 'విరూపాక్ష' సినిమా విషయంలో అదే జరిగింది.

సున్నితమైన నటన, సాంస్కృతిక మూలాలు, ప్రాంతీయతలను ప్రతిబింబించే కథాంశాలు మలయాళ సినిమాకు ఆయువుపట్లు. కానీ ఇక్కడ వినోదమే ప్రధానం. ఈ రెండు ప్రపంచాలకు సమన్వాయం ఎలా చేస్తున్నారు?

భారతదేశంలో ఒక నటిగా సినిమా పరిశ్రమను అన్వేషించేటప్పుడు... భిన్నమైన రాష్ట్రాలకు చెందిన భిన్నమైన సినీ పరిశ్రమల లోతుపాతులను అన్వేషించాలి. వాటిని యథాతథంగా స్వీకరించాలి. భిన్న రాష్ట్రాల ప్రేక్షకుల ఇష్టాయిష్టాలు కూడా భిన్నంగానే ఉంటాయి. భారతీయ సినీ పరిశ్రమ ఒకటే అయినప్పటికీ ప్రేక్షకులు భిన్నంగా ఉంటారు. అలాగని సినిమా కమర్షియల్ అయినంత మాత్రాన దానికి తగ్గట్టు మన నటనను మార్చుకోవలసిన అవసరం లేదని భావిస్తాను. అయితే ఒక పాత్ర నాకు తగినది కాదని అనిపించినప్పుడు... దాన్ని అంగీకరించడానికి వెనకాడతాను. అలా వద్దనుకున్న పాత్రలు కూడా ఉన్నాయి. నేను తెలుగు సినీ రంగంలోకి అడుగు పెట్టిన ఈ రెండేళ్ల కాలంలో తెలుగు ప్రేక్షకులు చక్కని నటనను, కథను చూడాలనుకుంటున్న విషయాన్ని గ్రహించాను. ప్రేక్షకులకు నచ్చినప్పుడే నటులకు భవిష్యత్తు ఉంటుంది. కాబట్టి వాళ్లకు నచ్చినది అందించగలగాలి.

మీరు తెలుగు ఎలా నేర్చుకున్నారు?

నటనా ప్రతిభ కనబరచాలంటే మొదట భాష తెలుసుకోవాలి. నా సహనటులు చెప్తున్న డైలాగ్స్ నాకు అర్థమైనప్పుడే... నేను మెరుగైన ప్రతిభ కనబరచగలుగుతాను. 'విరూపాక్ష' సినిమా రూపొందే సమయంలో కొవిడ్ వల్ల ఒక నెల ఖాళీ సమయం చిక్కింది. ఆ సమయంలో 'జూమ్' ద్వారా నేను తెలుగు భాష నేర్చుకున్నాను. మొదట్లో రెండు వాక్యాలతో మొదలుపెట్టాను. మొదట్లో తప్పులు మాట్లాడేదాన్ని. అయినా సిగ్గు పడకుండా మాట్లాడుతూనే తెలుగు భాష మీద పట్టు పెంచుకున్నాను. నేనిప్పుడు కొన్ని మాండలికాలను కూడా అనుకరించగలుగుతున్నాను.

మీ ఎమోషనల్ సపోర్ట్ ఎవరు?

నా కుటుంబానికి నేనే ఎమోషనల్ సపోర్ట్. నా ఎమోషనల్ సపోర్ట్... శివుడు. శైవ కాశ్మీర్ స్కూల్‌లో కాశ్మీర్ శైవిజం గురించి నేర్చుకున్నాను.

మీరు చేయబోతున్న తెలుగు ప్రాజెక్టులు?

'స్వయంభూ', 'అఖండ తాండవం' రిలీజ్ కాబోతున్నాయి. పూరీ జగన్నాథ్ గారి సినిమా ఎంతో ఆసక్తికరంగా ఉండబోతోంది. ఈ సినిమాలన్నీ విజయం సాధించాలని కోరుకుంటున్నా! ఫిమేల్ సెంట్రిక్ మూవీ 'బ్లాక్ గోల్డ్' కూడా విడుదల కాబోతోంది. బెల్లంకొండ శ్రీనివాస్‌తో కలిసి ఒక సినిమాలో నటిస్తున్నాను. తమిళంలో కూడా ఒక సినిమాలో నటిస్తున్నాను.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

సంకల్పం

ఈ వారసులు... తెరవెనుకే!

ఒకప్పుడు సినీ తారల వారసులు ఎక్కువ శాతం నటన వైపే మొగ్గు చూపేవారు. కానీ ఇప్పుడు ఆ ట్రెండ్ మారుతోంది. కొందరు సినీ ప్రముఖుల వారసులు నటనతో పాటు మిగిలిన రంగాలలో కూడా తమ ప్రతిభను చాటడానికి ఆసక్తి చూపుతున్నారు. దర్శకత్వం, రచన, సంగీతం, వీడియో ఎడిటింగ్ తదితర రంగాల్లో తమదైన ముద్ర వేయడానికి ముందడుగు వేస్తున్నారు.

వంద సంవత్సరాల భారతీయ సినీ చరిత్రను ఒకసారి పరిశీలిస్తే నటీనటుల దర్శకనిర్మాతల వారసులు నటులుగానే వెండితెరకు ఎంట్రీ ఇచ్చిన సందర్భాలు కనిపిస్తాయి. ఆ బాటలో వచ్చి సక్సెస్ అయిన వారి సంఖ్య కూడా ఎక్కువే. కానీ కొత్త తరం వారసుల దృష్టి ఇప్పుడు నటన మీద కంటే మిగిలిన శాఖల మీదే ఎక్కువగా ఉందని చెప్పాలి. ఇలా తెర వెనుకే ఉండి తమ ప్రతిభను చాటడానికి ప్రయత్నిస్తున్న కొందరి వారసుల వివరాలు ఇప్పుడు పరిశీలిద్దాం.




సంగీతంతో పాటు ఎడిటింగ్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనయుడు అకీరా నందన్ తమ ఆరాధ్యదైవం పవర్‌స్టార్‌లాగే హీరో అవుతాడని ఆశించారు మెగా అభిమానులు. అయితే అందుకు భిన్నంగా అతని అడుగులు సాగుతున్నాయి. పవన్‌కల్యాణ్ హీరోగా సుజీత్ తెరకెక్కించిన చిత్రం 'ఓజీ' ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహించిన థమన్‌తో కలసి నేపథ్య సంగీతం కోసం వర్క్ చేశాడు అకీరా. ఈ చిత్రంతో పాటూ 'రైటర్స్ బ్లాక్' అనే లఘు చిత్రానికి సంగీతం అందించాడు. కేవలం సంగీతం తోనే సరిపెట్టుకోకుండా వీడియో ఎడిటింగ్‌పైనా దృష్టి పెడుతున్నాడు అకీరా. తన తండ్రి పవన్‌కల్యాణ్ నటించిన సినిమాల్లోని సన్నివేశాలను ఆసక్తికరంగా ఎడిట్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటాడు. అకీరా వీడియో ఎడిటింగ్ నైపుణ్యాన్ని మెచ్చుకుంటూ సోషల్‌మీడియా ద్వారా షేర్ చేస్తుంటారు అతని తల్లి రేణూ దేశాయ్.

మెగాఫోన్ పట్టడమే లక్ష్యం


తన నటనతో మాస్ మహారాజాగా అభిమానుల నుంచి పేరు తెచ్చుకున్న రవితేజ తనయుడు మహాధన్ భూపతి రాజు లక్ష్యం కూడా మెగాఫోన్ పట్టడమే. ఈ క్రమంలోనే ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి తెరకెక్కించనున్న 'స్పిరిట్'లో సహాయ దర్శకుడిగా చేరాడు 'అర్జున్ రెడ్డి' 'యానిమల్' వంటి చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక పంథా ఏర్పరచుకున్న దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దగ్గర దర్శకత్వంలో మెలకువలు నేర్చుకుని ఓ స్టార్ దర్శకుడిగా ఎదగాలని అతని ప్రయత్నం.



రెండు పడవలపై ప్రయాణం



తమిళ కథానాయకుడు విజయ్ తనయుడు జేసన్ సంజయ్ తెరవెనుక కథలను అందంగా చెప్పే దర్శకత్వాన్నే తన రూట్‌గా మార్చుకున్నాడు. సందీప్ కిషన్ కథానాయకుడిగా జేసన్ ఇప్పుడు ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రం వర్కింగ్ టైటిల్ 'జేఎస్ 01'. అలాగే తన తండ్రి నటించిన 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' సినిమాలో ఓ చిన్న పాత్రలో మెరిశాడు. 'ఫుల్ ద ట్రిగ్గర్' అనే లఘు చిత్రంతో నటుడిగానూ సత్తా చాటాడు. అయితే తన కెరీర్ ముందుకు సాగే కొద్దీ జేసన్ నటనా, దర్శకత్వం రెండూ కొనసాగిస్తాడా లేదా కేవలం ఒకదానికే పరిమితమవుతాడా అనేది ఆసక్తికరం.



తండ్రితోనే చిత్రం!

బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ తనయుడు చూడ్డానికి సినిమా హీరోలా ఉండడంతో కింగ్‌ఖాన్ అభిమానులు కూడా అతను తన తండ్రిలాగే హీరో అవుతారని భావించారు. కానీ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ 'బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' అనే నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌తో ఆర్యన్ దర్శకుడిగా మారిపోయాడు. తన మేకింగ్ స్టైల్‌తో విమర్శకుల్నీ, ప్రేక్షకుల్నీ ఆకట్టుకున్నాడు. ఇప్పుడు ఆర్యన్ తన తదుపరి చిత్రాన్ని థియేట్రికల్‌గా గ్రాండ్‌గా ప్లాన్ చేస్తుండడం విశేషం. దర్శకుడిగా తనకంటూ ఓ మంచి గుర్తింపు వచ్చిన తర్వాత తన తండ్రి షారుక్ ఖాన్‌తో ఓ చిత్రం చేయాలనే ఆలోచనల్లో ఉన్నాడీ యంగ్ సెన్సేషన్. అలాగే, షారుక్ నటించిన 'కభీ ఖుషీ కభీ గమ్' సినిమాలో బాల నటుడిగా సత్తా చాటడంతో పాటు 'ఇంక్రిడబుల్స్', 'ద లయన్ కింగ్' లాంటి హాలీవుడ్ యానిమేషన్ చిత్రాలకు తన గొంతునూ అందించాడు ఆర్యన్. ఇలా కేవలం స్టార్ హీరోల వారసులే కాదు, ప్రముఖ దర్శక నిర్మాతల తనయులు కూడా దర్శకత్వం వైపు మొగ్గు చూపిస్తున్నారు. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తనయుడు రిషి మనోజ్ కూడా 'స్పిరిట్' చిత్రానికి గాను సందీప్ రెడ్డి వంగా దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరాడు. అలాగే, ఓ లఘు చిత్రంలో హీరోగానూ నటించాడు. నిర్మాత శోభు యార్లగడ్డ తనయుడు కార్తీక్ యార్లగడ్డ ప్రస్తుతం లఘు చిత్రాలు చేసి... ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్ కావాలని అడుగులేస్తున్నాడు.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మెరైన్స్	వెబ్‌సిరీస్	నవంబర్ 10
ఢిల్లీ క్రైమ్ 3	హిందీ సిరీస్	నవంబర్ 13
అమెజాన్ ప్రైమ్		
ప్లే డేట్	ఒరిజినల్ మూవీ	నవంబర్ 12
జియో హాట్‌స్టార్		
జాలీ ఎల్ఎల్‌బీ 3	హిందీ చిత్రం	నవంబర్ 14
జీ 5		
ఇన్‌స్పెక్షన్ బంగ్లా	మలయాళ సిరీస్	నవంబర్ 14
మనోరమా మ్యాక్స్		
కప్లింగ్	మలయాళ చిత్రం	నవంబర్ 14

బిజినెస్ ప్లస్

తిరుపతి ● ఆదివారం 9 నవంబరు 2025



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,000 ▼	1,11,800 ▼	1,64,000 ▼
విజయవాడ	1,24,000 ▼	1,16,000 ▼	1,51,700 ▼
విశాఖపట్నం	1,21,910 ▼	1,11,750 ▲	1,65,000 ▲
రాజమండ్రి	1,22,020 ▲	1,11,850 ▲	1,49,000 ▲
ప్రొద్దుటూరు	1,21,450 ▲	1,11,730 ▲	1,51,600 ▼
ముంబై	1,20,100 ▼	1,10,012 ▼	1,48,275 ▲

డిజిటల్ గోల్డ్‌కు రక్షణ లేదా..?

అనియంత్రిత ప్లాట్‌ఫామ్స్, సంస్థల ద్వారా పసిడిలో పెట్టుబడులపై ప్రజలను హెచ్చరించిన సెబీ

ముంబై: దేశంలో డిజిటల్ గోల్డ్, ఆన్‌లైన్ పసిడి పథకాల్లో పెట్టుబడులు ఊపందుకున్న నేపథ్యంలో అనియంత్రిత వేదికలు, సంస్థల ద్వారా కొనుగోళ్లపై క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ హెచ్చరించింది. "కొన్ని డిజిటల్/ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ఇన్వెస్టర్లకు పసిడి లోహం కొనుగోళ్లకు ప్రత్యామ్నాయంగా డిజిటల్ గోల్డ్ లేదా ఈ-గోల్డ్ సాధనాలను ఆఫర్ చేస్తున్నట్లు సెబీ దృష్టికి వచ్చింది. అయితే, వాటిలో పెట్టుబడులకు రక్షణ ఉండదని, సెక్యూరిటీస్ లేదా కమోడిటీ డెరివేటివ్స్‌గా గుర్తింపు లేనందున అవి సెక్యూరిటీస్ మార్కెట్ రక్షణ పరిధిలోకి రావని" శనివారం విడుదల చేసిన ప్రకటనలో సెబీ స్పష్టం చేసింది. ఈ-గోల్డ్ లేదా డిజిటల్ గోల్డ్ స్కీమ్‌లు సెక్యూరిటీస్ మార్కెట్ పరిధికి వెలుపల పనిచేస్తాయి గనుక వాటిల్లో పెట్టుబడులకు తమ రక్షణ ఉండదని తెలిపింది.

నియంత్రణ పథకాలకే సెబీ రక్షణ

పసిడిలో పెట్టుబడులు పెట్టేందుకు నియంత్రిత సంస్థల ద్వారా ఇప్పటికే పలు సాధనాలను అందుబాటులోకి తేవడం జరిగిందని సెబీ పేర్కొంది. ఎక్స్ఛేంజీలో ట్రేడయ్యే గోల్డ్ డెరివేటివ్ కాంట్రాక్టులు, మ్యూచువల్ ఫండ్లు ఆఫర్ చేసే గోల్డ్ ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్లు (ఈటీఎఫ్), స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడయ్యే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ (ఈజీఆర్) ఇందుకు ఉదాహరణలు. సెబీ చట్టం పరిధిలోకి వచ్చే సంస్థలు ఆఫర్ చేసే బంగారం పథకాల్లో పెట్టుబడులు..మాత్రమే మా పర్యవేక్షణ,రక్షణ నియమావళి పరిధిలోకి వస్తాయని నియంత్రణ మండలి స్పష్టం చేసింది.

బ్యాంకు ఖాతాలో సొమ్ము మరిచిపోయారా..!

రీక్లెయిమ్ చేసుకోండి ఇలా..

మనలో చాలా మందికి బ్యాంకుల్లో పొదుపు ఖాతా (ఎస్‌బీ), కరెంట్ ఖాతాలు లేదా టర్మ్ డిపాజిట్లు ఉంటాయి. కొంతమంది తమ ఖాతాలను రెగ్యులర్‌గా నిర్వహిస్తుంటారు. మరికొంత మంది వాటిని సరిగా నిర్వహించరు.. లేదంటే ఏదో ఒక కారణంతో మర్చిపోతారు. ఒక్కోసారి ఖాతాదారుడు లేదా డిపాజిటర్ చనిపోతే వారి వారసులకు వాటి వివరాలు తెలియక పోవచ్చు. ఇలాంటి సందర్భాల్లోనూ మరుగున పడిన ఈ ఖాతాలు, డిపాజిట్లలోని డబ్బులు తిరిగి క్లెయిమ్ చేసుకోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం.

బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఏటేటా పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి ఈ మొత్తం రూ.67,000 కోట్లకు చేరింది. దీంతో ఈ మొత్తాన్ని వాటి అసలు ఖాతాదారులు లేదా వారి వారసులకు అప్పగించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) చర్యలు చేపట్టింది. ఇందుకోసం అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్-గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్ (ఉద్గమ్) పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్ ద్వారా బ్యాంకు ఎస్‌బీ/కరెంట్ అకౌంట్ ఖాతాదారులు లేదా టర్మ్ డిపాజిటర్లు లేదా వారి వారసులు ఆ ఖాతాల్లోని మొత్తాలను తిరిగి క్లెయిమ్ చేసుకోవచ్చు.

పదేళ్ల పాటు నిర్వహణలో లేకపోతేనే..

బ్యాంకులోని ఏదైనా ఒక ఎస్‌బీ/కరెంట్ ఖాతాను పదేళ్ల పాటు ఆపరేట్ చేయకపోతే బ్యాంకులు దాన్ని ఇన్‌ఆపరేటివ్ ఖాతాగా పరిగణించి ఆ ఖాతాలోని మొత్తాన్ని ఆర్‌బీఐ నిర్వహించే డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (డీఈఏ) ఫండ్‌కు బదిలీ చేస్తాయి. గడువు దాటిన పదేళ్లలోపు వెనక్కి తీసుకోని టర్మ్ డిపాజిట్లను కూడా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా పరిగణించి డీఈఏ ఫండ్‌కు మళ్లిస్తారు. udgam.rbi.org.in పోర్టల్‌కు లాగిన్ అయి అవసరమైన వివరాలు సమర్పించడం ద్వారా ఈ ఖాతాల్లోని బ్యాలెన్స్ లేదా డిపాజిట్ల మొత్తాన్ని ఖాతాదారులు లేదా వారి వారసులు పొందవచ్చు.



డీఈఏ ఫండ్ నుంచి క్లెయిమ్ చేసుకోవచ్చా?

మర్చిపోయిన లేదా క్లెయిమ్ చేయని ఎస్‌బీ/కరెంట్ ఖాతాల్లోని సొమ్మును లేదా ఫిక్స్‌డ్ లేదా టర్మ్ డిపాజిట్లను ఖాతాదారులు లేదా వారి వారసులు ఉద్గమ్ పోర్టల్‌లో లాగిన్ అయి అవసరమైన వివరాలు సమర్పించటం ద్వారా ఆయా బ్యాంకుల నుంచే క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇందుకు ఎలాంటి కాలపరిమితి లేదు. బ్యాంకులు ఈ సొమ్మును డీఈఏ నుంచి రీక్లెయిమ్ చేసుకుంటాయి.

ఖాతాను గుర్తించడం ఎలా..?

వ్యక్తిగత ఖాతాదారులైతే ఉద్గమ్ పోర్టల్‌లో తమ పేరు, ఖాతా లేదా డిపాజిట్ ఉన్న బ్యాంకు పేరు ఎంటర్ చేయాలి. వీటికి తోడు ఓటర్, పాన్‌కార్డు నంబర్, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు నంబర్ లేదా ఖాతాదారుడి పుట్టిన తేదీ సర్టిఫికెట్.. వీటిలో ఏదో ఒకటి సమర్పించాలి. అదే నాన్ ఇండివిడ్యువల్స్ అయితే సంస్థ పేరు, ఖాతా ఉన్న బ్యాంకు పేరుతో పాటు సంస్థ అధీకృత అధికారి సంతకం, పాన్ నంబరు, కంపెనీ గుర్తింపు నంబర్ (సీఐఎన్), కంపెనీని నమోదు చేసిన తేదీ.. వీటిల్లో ఏదో ఒకదాని వివరాలు ఎంటర్ చేయాలి. ఒకవేళ పై వివరాలేవీ లేకపోయినా ఉద్గమ్ పోర్టల్‌లో వ్యక్తిగత, సంస్థాగత ఖాతాదారులు తమ చిరునామా ఎంటర్ చేయడం ద్వారా తమ డిపాజిట్లను క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఇతర మార్గాలూ ఉన్నాయ్..

ఒకవేళ ఉద్గమ్ పోర్టల్ ద్వారా మర్చిపోయిన ఖాతాలు లేదా డిపాజిట్లు క్లెయిమ్ చేసుకోవడం కష్టమనిపిస్తే... ఖాతా లేదా డిపాజిట్ ఉన్న బ్యాంకుకు చెందిన ఏదైనా బ్రాంచ్‌కు వెళ్లి ఆధార్, పాస్‌పోర్టు, ఓటర్ ఐడీ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు వంటి వివరాలు సమర్పించాలి. బ్యాంకు ఈ వివరాలను నిర్ధారించుకున్న తర్వాత మీ సొమ్మును వడ్డీతో సహా చెల్లిస్తుంది. udgam.rbi.org.in పోర్టల్‌లో రిజిస్టరై లాగిన్ కావడం ద్వారా మీ ఖాతాలో ఎంత మొత్తం ఉన్నదీ తెలుసుకోవచ్చు.

డీఈఏ ఫండ్‌కు చేరే ఖాతాల సొమ్ము

పదేళ్లుగా ఆపరేట్ చేయని లేదా గడువు ముగిసి పదేళ్లయినా క్లెయిమ్ చేయని ఈ కింది ఖాతాల్లోని సొమ్ము డీఈఏ ఫండ్‌కు చేరతాయి. వాణిజ్య, సహకార బ్యాంకుల్లోని ఖాతాలకూ ఈ నిబంధన వర్తిస్తుంది. ఆ ఖాతాలు ఏమిటంటే..

- సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాలు
- ఫిక్స్‌డ్ లేదా టర్మ్ డిపాజిట్ ఖాతాలు
- క్యుములేటివ్/ రికరింగ్ డిపాజిట్ ఖాతాలు
- కరెంట్ డిపాజిట్ ఖాతాలు
- క్యాష్ క్రెడిట్ ఖాతాలు
- ఏదో ఒక పేరుతో లేదా ఏదో ఒక రూపంలో ఉన్న ఇతర డిపాజిట్ ఖాతాలు
- కేటాయింపుల తర్వాత రుణ ఖాతాల్లోని మిగులు
- లెటర్ ఆఫ్ క్రెడిట్/గ్యారెంటీతో పాటు ఇతర సెక్యూరిటీ డిపాజిట్లపై జారీ చేసే మార్జిన్ మనీ

ఉద్గమ్ పోర్టల్ పాత్ర

ఈ విషయంలో ఉద్గమ్ పోర్టల్‌ది కేవలం వెసులుబాటు పాత్ర మాత్రమే. ఖాతాదారులకు రావాల్సిన మొత్తాన్ని సంబంధిత బ్యాంక్ చెల్లిస్తుంది. ప్రస్తుతం ఉద్గమ్ పోర్టల్‌లో దేశంలోని 30 బ్యాంకులు సభ్యత్వం కలిగి ఉన్నాయి. కాకపోతే ఈ పోర్టల్ ద్వారా తమ సొమ్మును రీక్లెయిమ్ చేసుకోవాలంటే బ్యాంకు ఖాతాదారులు, డిపాజిటర్లు తమ పేరు, మొబైల్ నంబర్‌తో ముందుగా రిజిస్టర్ చేసుకోవాలి.

ప్రత్యేక క్యాంపులు

ఎస్‌బీ/కరెంట్ ఖాతాల్లోని అన్‌క్లెయిమ్డ్ మొత్తాలను, ఫిక్స్‌డ్ లేదా టర్మ్ డిపాజిట్లను ఖాతాదారులకు అందించేందుకు ఆర్‌బీఐ ఈ ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ప్రతి జిల్లాలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తోంది. ఈ క్యాంపుల ద్వారానూ తమ సొమ్మును రీక్లెయిమ్ చేసుకోవచ్చు.

ఐటీసీ.. 90% నిబంధన!

జీఎస్‌టీలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను తీసుకోవటానికి నిబంధనలు ఎలా ఉన్నాయో.. తీసుకున్న క్రెడిట్‌ను వాడుకోవటానికి కూడా అలాగే నిబంధనలు ఉన్నాయి. ఇందులో చాలా మంది పట్టించుకోని విషయం 99 శాతం నిబంధన. ఈ నిబంధన ఏమిటనేది ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

నవీన్ చంద్ర పేరుమోసిన బట్టల వ్యాపారి. రాష్ట్రంలోని అన్ని ముఖ్య పట్టణాల్లో షోరూమ్స్ ఉన్నాయి. వ్యాపారం విషయంలో ఎంత నిక్కచ్చిగా ఉంటాడో, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల విషయంలోనూ అంతే కచ్చితత్వం పాటిస్తాడు. కట్టాల్సిన పన్నులను బకాయిలు లేకుండా సకాలంలో చెల్లించాలని తన సిబ్బందికి చెబుతుంటాడు. అలాంటిది జీఎస్‌టీ డిపార్ట్‌మెంట్ నుంచి తనకు ఒక నోటీస్ అందింది. గడిచిన కొన్ని నెలల్లో తాను కట్టాల్సిన పన్ను మొత్తం అంటే 100 శాతం పన్నును ఐటీసీ ద్వారానే చెల్లించారనీ, జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఒక నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే చెల్లించాల్సిన పన్నులో 99 శాతం మాత్రమే ఐటీసీ ద్వారా చెల్లించి మిగతా మొత్తాన్ని నగదు రూపంలో అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాల్సి ఉండగా.. మొత్తం పన్నును ఐటీసీతో చెల్లించటం చట్ట ఉల్లంఘన కిందకు వస్తుందని, కాబట్టి ఆ తేడా మొత్తాన్ని వెంటనే చెల్లించాలని స్పష్టం చేసింది. తనకు చట్ట ప్రకారం అర్హత ఉన్న ఇన్‌పుట్స్ మీదనే క్రెడిట్ తీసుకున్నాడు. ఆ క్రెడిట్‌నే పన్ను చెల్లింపునకు ఉపయోగించాడు. పన్ను మొత్తాన్ని క్రెడిట్ ద్వారా చెల్లించకూడదా? అని సందేహం వచ్చింది.


ఇదీ GST
రాంబాబు గొండాల

రూ.50 లక్షల టర్నోవర్ దాటితేనే..

ఏదేనీ నెలలో టర్నోవర్ రూ.50 లక్షలు మించితేనే అప్పుడు ఈ 99 శాతం నిబంధన అమల్లోకి వస్తుంది. అంటే చెల్లించాల్సిన పన్నులో 99 శాతానికి మించి ఐటీసీ వాడకూడదు. దీని అర్థం మిగతా ఒక శాతం కచ్చితంగా నగదు చెల్లింపు ద్వారా అంటే క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాలి అని. మరి టర్నోవర్ అంటే ఏం తీసుకోవాలి? ఇందులో నెలలో జరిగిన మొత్తం సరఫరాల విలువ నుంచి పన్ను మినహాయింపు ఉన్న సరఫరాల విలువ, జీరో రేటెడ్ సరఫరాల విలువ మినహాయించాలి. (జీరో రేటెడ్ సరఫరా అంటే ఎగుమతులకు లేదా సెజ్‌లకు పంపిన సరఫరా). ఇలా మినహాయించగా మిగిలిన మొత్తాన్ని టర్నోవర్ కింద లెక్కించాలి. ఇలా లెక్కించిన టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే ఈ రూల్ వర్తిస్తుంది. అలా అని రూ.50 లక్షల టర్నోవర్ దాటిన ప్రతి కేసులోనూ ఈ 99 శాతం నిబంధన అమలవుతుందని అనుకోకూడదు. దీనికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి.

మినహాయింపులున్నాయ్..

గడచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ రిజిస్ట్రేషన్ పొందిన సంస్థ లేదా వ్యక్తి రూ.లక్షకు మించి ఆదాయ పన్ను చెల్లించి ఉన్నా లేదా గడచిన ఆర్థిక సంవత్సరం సదరు సంస్థ లేదా వ్యక్తి రూ.లక్షకు మించి రిఫండ్ పొంది ఉన్నా (ఈ రిఫండ్ అనేది ట్యాక్స్ చెల్లించకుండా చేసే జీరో రేటెడ్ సరఫరాలకు లేదా ఇన్వర్టెడ్ ట్యాక్స్ స్ట్రక్చర్‌కు సంబంధించినవై ఉండాలి) లేదా ఇప్పటి వరకు అయిన టర్నోవర్ మీద ఇప్పటికే నగదులో ఒక శాతానికి మించి కట్టి ఉన్నా, ఇలాంటి సందర్భాల్లో ఈ రూల్ అమలు కాదు మిగతా అన్ని సందర్భాల్లోనూ ఎప్పుడైతే టర్నోవర్ రూ.50 లక్షలు దాటుతుందో అప్పుడు కనీసం ఒక శాతం పన్ను క్యాష్ లెడ్జర్ ద్వారా చెల్లించాలి.

కాబట్టి, జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ పొందిన వ్యక్తులు.. ఐటీసీ తీసుకోవటానికి గల నిబంధనలతో పాటు తీసుకున్న క్రెడిట్‌ను ఎలా వాడాలి? ఎంత మేరకు వాడాలి? ఇతరత్రా నియమ నిబంధనలు కూడా తెలుసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం రూ.49 కోట్లు

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.49.43 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.47.65 కోట్లు)తో పోల్చితే లాభం స్వల్పంగా 4 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.524 కోట్ల నుంచి రూ.657 కోట్లకు పెరిగింది. సెప్టెంబరు ముగిసే నాటికి ఆర్డర్ బుక్ 9,818 ఎలక్ట్రిక్ వాహనాలుగా ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	590	విజయవాడ	600
వరంగల్	592	గోదావరి	600
చిత్తూరు	623	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	106
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	103
కర్నూలు	100	నెల్లూరు	108
విశాఖపట్నం	108	అనంతపురం	108
గోదావరి	106		

స్పోర్ట్స్

ఆఖరిది వరుణుడి ఖాతాలోకి

- ఆసీస్‌తో ఐదో టీ20 రద్దు
- 2-1తో భారత్‌దే సిరీస్



బ్రిస్బేన్: ఐదు టీ20ల సిరీస్‌లో చివరి మ్యాచ్.. హ్యాట్రిక్ విజయంతో సిరీస్‌ను పట్టేయాలని భారత్ బరిలోకి దిగితే.. ఎలాగైనా సమం చేయాలనే కసితో ఆస్ట్రేలియా పోటీ పడింది. దీంతో ప్రఖ్యాత గాబా మైదానంలో ఎవరిది ఆధిపత్యమో తెలుసుకునేందుకు అభిమానులు కూడా ఎనలేని ఆసక్తి ప్రదర్శించారు. కానీ ఆట ఆరంభమై ఐదు ఓవర్లు కూడా పూర్తి కాకుండానే ఫ్యాన్స్ ఉత్సాహంపై వరుణుడు నీళ్లుజల్లాడు. సిరీస్‌లో తొలి మ్యాచ్ తరహాలోనే శనివారం జరిగిన ఐదో టీ20 కూడా వర్షంతో రద్దయ్యింది. కేవలం 29 బంతుల ఆటే సాధ్యమైంది. అయితే ఇప్పటికే 2-1తో ఆధిక్యంలో ఉండడంతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌ను కైవసం చేసుకుంది. తద్వారా ఆస్ట్రేలియా గడ్డపై ఈ ఫార్మాట్‌లో టీమిండియా తన అజేయ ఆటతీరును కొనసాగించింది.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ ధాటిగా సాగింది. ఓపెనర్లు గిల్ (16 బంతుల్లో 6 ఫోర్లతో 29 నాటౌట్), అభిషేక్ శర్మ (13 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 23 నాటౌట్) ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగారు. తొలి ఓవర్‌లో చెరో ఫోర్ బాదగా.. అభిషేక్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను మ్యాక్స్‌వెల్ వదిలేశాడు. ఇక మూడో ఓవర్‌లో గిల్ 4 ఫోర్లతో చెలరేగి 16 రన్స్ అందించాడు. తర్వాతి ఓవర్‌లోనే అభిషేక్ ఫైన్ లెగ్‌లో ఇచ్చిన మరో క్యాచ్‌ను డ్వార్షుస్ వదిలేశాడు. అయితే భారత్ 4.5 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 52 పరుగులతో నిలిచిన దశలో.. తీవ్రమైన ఉరుములు, మెరుపులు రావడంతో ఆటగాళ్లంతా మైదానం వీడారు. ఆ తర్వాత చిరుజల్లులు మొదలై భారీ వర్షం కురవడంతో మైదానం చిత్తడిగా మారింది. దాదాపు రెండున్నర గంటలు వేచి చూసినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఆసీస్‌లో సమయం రాత్రి 9 కావడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా అభిషేక్ నిలిచాడు.

1 తక్కువ బంతుల్లోనే (528) టీ20ల్లో వెయ్యి పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా అభిషేక్. సూర్యకుమార్ (573)ను అధిగమించాడు.

2 తక్కువ ఇన్నింగ్స్ (28)లో టీ20ల్లో వెయ్యి పరుగులు పూర్తి చేసిన రెండో బ్యాటర్‌గా అభిషేక్. విరాట్ (27) ముందున్నాడు.



స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (నాటౌట్) 23, గిల్ (నాటౌట్) 29; **ఎక్స్‌ట్రాలు:** 0; **మొత్తం:** 4.5 ఓవర్లలో 52/0. **బౌలింగ్:** డ్వార్షుస్ 2-0-27-0, బార్ట్‌లెట్ 1.5-0-13-0, ఎలిస్ 1-0-12-0.

ఆసియా 'ట్రోఫీ' రాబోతోంది!

నఖ్వీతో సమావేశమైన బీసీసీఐ కార్యదర్శి

దుబాయ్: ఆసియాకప్ టీ20 టోర్నీలో చాంపియన్‌గా నిలిచిన టీమిండియాకు దాదాపు నెలన్నర రోజులైనా ట్రోఫీ అందలేదు. అయితే ఈ విషయమై దుబాయ్‌లో జరుగుతున్న ఐసీసీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో బీసీసీఐ, పీసీబీ చైర్మన్ మొహిసిన్ నఖ్వీ మధ్య సానుకూలంగా చర్చలు జరిగాయి. త్వరలోనే ట్రోఫీ మనకు అందుతుందన్న విశ్వాసం ఉందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించాడు. 'అజెండాలో లేనప్పటికీ సీనియర్ ఐసీసీ అధికారుల సమక్షంలో నేను, నఖ్వీ భేటీ అయ్యాం. ఇక ఈ విషయమై ప్రతిష్టంభన తొలగినట్టే' అని సైకియా తెలిపాడు. సెప్టెంబరు 28న ఆసియాకప్ ఫైనల్లో గెలిచిన భారత్ ఏసీసీ చీఫ్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు నిరాకరించింది. దీంతో నఖ్వీ కప్‌ను తీసుకెళ్లి తన కార్యాలయంలో భద్రపరిచాడు.

పృథ్వీరాజ్‌కు 4 వికెట్లు

తమిళనాడు 182 ఆలౌట్

ఆంధ్రతో రంజీ



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లెఫ్టామ్ పేసర్ పృథ్వీరాజ్ (4/46) చెలరేగడంతో.. శనివారం మొదలైన రంజీ మ్యాచ్‌లో తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 182 పరుగులకే కుప్పకూలింది. పృథ్వీకి తోడు స్పిన్నర్ సౌరభ్ కుమార్ (8.5-4-4-2) పొదుపైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అయితే 103 పరుగులకే తొమ్మిది వికెట్లు కోల్పోయిన వేళ.. టెయిలెండర్లు విద్యుత్ (40), వారియర్ (29 నాటౌట్) పోరాడి ఆఖరి వికెట్‌కు 79 పరుగులు జోడించారు. ఆ తర్వాత మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్ర జట్టు తొలిరోజు ముగిసే సరికి 20/1 స్కోరు సాధించింది. క్రీజులో అభిషేక్ (3), విజయ్ (1) ఉన్నారు.

గంగూలీని ఆపలేరు..

భవిష్యత్‌లో అతడు ఐసీసీ అధ్యక్షుడు అవుతాడు

బెంగాల్ సీఎం మమత



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి భారత జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి మద్దతుగా నిలిచారు. ఈక్రమంలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. దాదా ఐసీసీ అధ్యక్షుడు కాకుండా ఎవరూ ఆపలేరని స్పష్టంజేశారు. అసలు సౌరవ్ ఈ పాటికే ఐసీసీ చీఫ్ కావాల్సి ఉందన్నారు. వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టు సభ్యురాలు రిచా ఘోష్‌ను బెంగాల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇక్కడ సన్మానించారు. ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మమత మాట్లాడుతూ.. 'అసలు ఈ రోజు ఐసీసీ చీఫ్‌గా ఉండాల్సింది ఎవరు? అతడు గంగూలీ తప్ప మరొకరు కాదు. అతడు ఇప్పుడు అధ్యక్షుడు కాకపోయి ఉండొచ్చు. కానీ ఏదో ఒకరోజు దాదా ఆ పదవి తప్పకుండా చేపడతాడు. అప్పుడు అతడిని ఆపడం ఎవరి తరమూ కాదు' అని వ్యాఖ్యానించారు.

జురెల్ మరో శతకం

భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్ 382/7 డిక్లేర్

బెంగళూరు: భారత్ 'ఎ' వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ అద్భుత ఫామ్‌తో దూసుకెళుతున్నాడు. దక్షిణాఫ్రికా 'ఎ'తో రెండో అనధికార టెస్టులో అతను వరుసగా రెండో శతకం (127 నాటౌట్) బాదాడు. దీంతో.. ఓవర్‌నైట్ స్కోరు 78/3తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఎ' 382/7 స్కోరు చేసి డిక్లేర్ చేసింది. హర్ష్ దూబే (84), కెప్టెన్ రిషభ్ పంత్ (65) అర్ధసెంచరీలు సాధించారు. మొదట 17 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన పంత్.. దూబే అవుటయ్యాక తిరిగి క్రీజులోకి వచ్చి తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. దీంతో అతడి గాయంపై జట్టుకు ఆందోళన పడాల్సిన అవసరం లేకపోయింది. ఇక, తొలి ఇన్నింగ్స్‌లోనూ జురెల్ అజేయ శతకంతో నిలిచిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 417 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా మూడోరోజు ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 25/0 స్కోరు చేసింది. ఆటకు ఆదివారమే చివరిరోజు కాగా.. సఫారీలు 392 రన్స్ వెనుకంజలో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 'ఎ' 255, సఫారీ జట్టు 221 రన్స్ చేశాయి.

గుకేష్‌కు షాక్

మూడో రౌండ్‌లో నిష్క్రమణ

వరల్డ్ కప్ చెస్

పనాజీ: ప్రపంచ కప్ చెస్‌లో పెను సంచలనం చోటు చేసుకుంది. వరల్డ్ చాంపియన్ గుకేష్‌కు మూడో రౌండ్‌లో చుక్కెదురైంది. జర్మన్ గ్రాండ్‌మాస్టర్ ఫ్రెడరిక్ స్వాన్ టాప్‌సీడ్ గుకేష్‌కు షాకిచ్చాడు. శనివారం జరిగిన రెండో క్లాసికల్ గేమ్‌లో తెల్లపావులతో బరిలో దిగినా గ్రాండ్‌మాస్టర్ గుకేష్ 55 ఎత్తుల్లో పరాజయం చవిచూడడం గమనార్హం. ఇద్దరి మధ్య జరిగిన తొలి గేమ్ డ్రా అయిన సంగతి తెలిసిందే. రెండో గేమ్ నెగ్గిన స్వాన్ 1.5-0.5 స్కోరుతో గుకేష్‌ని ఓడించి ముందంజ వేశాడు. భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద, పెంటేల హరికృష్ణ, వి.ప్రణవ్ కూడా రౌండ్-32కి చేరారు. కార్తీక్ వెంకటరామన్-బోగ్దాన్ డానియల్ (రుమేనియా) మూడో రౌండ్ రెండో గేమ్‌కూడా డ్రా అయ్యింది. దాంతో ఇద్దరూ చెరో పాయింట్‌తో నిలవడంతో పోరు టైబ్రేక్‌కు మళ్లింది.

లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో భారత్ X పాక్ పోరు లేనట్టేనా?

దుబాయ్: చాలా దశాబ్దాల తర్వాత.. చెప్పాలంటే 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం చేస్తోంది. 2028 లాస్‌ఏంజిల్స్ విశ్వక్రీడల్లో క్రికెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. టీ20 ఫార్మాట్‌లో నిర్వహించే పోటీల్లో పురుషులు, మహిళల క్రికెట్ జట్లు బరిలో దిగనున్నాయి. అయితే ప్రపంచంలో ఎక్కడ టోర్నీ జరిగినా ఫ్యాన్స్ అంతా ఆసక్తిగా చూసేది భారత్-పాకిస్థాన్ పోరు కోసమే. అలాగే ఒలింపిక్స్‌లోనూ ఈ రెండు జట్లు పరస్పరం తలపడతాయా? అనే ఆసక్తి అభిమానుల్లో ఏర్పడింది. కానీ విశ్వక్రీడల్లో భారత్, పాకిస్థాన్ జట్లు ముఖాముఖి ఢీకొనే అవకాశాలు కనిపించడం లేదు. అసలు పాక్ జట్టుకు 'లాస్‌ఏంజిల్స్'లో చోటు దక్కడమే గగనంగా మారింది. ఇందుకు ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు సంబంధించి ఐసీసీ రూపొందించిన నిబంధనలే. పురుషులు, మహిళల విభాగాలలో ఆరేసి జట్లకే ఐసీసీ చోటు కల్పించింది. ఈ జట్లను ర్యాంకుల ఆధారంగా ఎంపిక చేయాలని ఐసీసీ తొలుత భావించింది. కానీ ఒక్కో ఖండం/ప్రాంతం నుంచి ఒక్కో అత్యుత్తమ జట్టును ఎంపిక చేసి..ఆరో జట్టును క్వాలిఫయింగ్ రౌండ్ ద్వారా తీసుకోవాలని ఐసీసీ తాజాగా నిర్ణయించినట్టు సమాచారం. ఆ ప్రకారం చూస్తే..ఆసియా ఖండం నుంచి ఒక్క జట్టే విశ్వక్రీడల్లో అడుగుపెట్టనుంది. ప్రస్తుతం టీ20లలో టాప్ ర్యాంక్‌లో ఉన్న టీమిండియా ఆసియా నుంచి ఒలింపిక్స్‌కు క్వాలిఫై కానుంది. ఒషియానా నుంచి ఆస్ట్రేలియా, యూరప్ నుంచి ఇంగ్లండ్, ఆఫ్రికా నుంచి దక్షిణాఫ్రికాలకు చోటు లభించనుంది. కారణం ఆయా ప్రాంతాలనుంచి ఈ మూడు జట్లు టాప్‌లో ఉండడమే. ఇక ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిస్తున్నందున అమెరికాకూ చోటు దక్కనుంది. మిగిలిన ఒక్క జట్టును గ్లోబల్ క్వాలిఫయర్స్ టోర్నీ ద్వారా ఎంపిక చేస్తారు. కానీ ఈ క్వాలిఫయర్స్‌లో మేటి జట్లు తలపడనున్న నేపథ్యంలో.. ఇందులో విజేతగా నిలిచి పాక్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తుందా? చూడాలి.



భారత 91వ గ్రాండ్‌మాస్టర్.. రాహుల్

న్యూఢిల్లీ: భారత చెస్ ఆటగాడు రాహుల్ వీఎస్ గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదా సాధించాడు. ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఏషియన్ చెస్ వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లో తమిళనాడుకు చెందిన 21 ఏళ్ల రాహుల్ విజేతగా నిలిచాడు. దీంతో జీఎంకు అవసరమైన చివరి నార్మ్‌ను రాహుల్ అందుకున్నాడు. రాహుల్.. భారత్ తరఫున 91వ గ్రాండ్‌మాస్టరయ్యాడు.

రవిందర్ గోల్డెన్ షూట్


- ఎలవెనిల్‌కు కాంస్యం

షూటింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్



కైరో: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో శనివారం భారత షూటర్లు పతకాలతో సత్తా చాటారు. భారత ఆర్మీలో నాయక్ సుబేదార్‌గా పనిచేస్తున్న 29 ఏళ్ల రవీందర్ సింగ్ 50 మీటర్ల వ్యక్తిగత పిస్టల్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించాడు. ఇక, 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో కమల్జీత్, యోగేశ్వర్, రవీందర్‌లతో కూడిన భారత జట్టు రజతం నెగ్గింది. దీంతో రవీందర్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. ఇక, వ్యక్తిగత 10 మీటర్ల రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్ ఎలవెనిల్ వలరివన్ కాంస్యం దక్కించుకుంది. ఇదే 10 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో ఎలవెనిల్, మేఘన, శ్రేయాలతో కూడిన భారత త్రయం కాంస్యం అందుకుంది.

బ్యాడ్మింటన్‌కు తైజు గుడ్‌బై



15 ఏళ్ల కెరీర్‌లో 17 టైటిళ్లు

సింధుతో మరపురాని మ్యాచ్‌లెన్నో..

న్యూఢిల్లీ: తైపీకి చెందిన ప్రఖ్యాత షట్లర్ తైజు యింగ్ బ్యాడ్మింటన్‌కు గుడ్‌బై చెప్పింది. తిరగబెడుతున్న గాయాలవల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు 31 ఏళ్ల ప్రపంచ మాజీ నెంబర్ వన్ తైజు శనివారం వెల్లడించింది. టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత అయిన తైజు.. తన 15 ఏళ్ల కెరీర్‌లో 17 బీడబ్ల్యూఎఫ్ టైటిళ్లు సొంతం చేసుకుంది. మరో 12 ఈవెంట్లలో రన్నరప్‌గా నిలిచింది. 2024లో ఇండియా ఓపెన్‌తో చివరి బీడబ్ల్యూఎఫ్ టైటిల్ అందుకుంది.

నా పయనంలో నిన్ను కోల్పోతున్నా: సింధు

సమకాలీన బ్యాడ్మింటన్‌లో భారత స్టార్ పీవీ సింధు, తైజు చిరకాల ప్రత్యర్థులు. వీరిద్దరి మ్యాచ్ అంటే బ్యాడ్మింటన్ ప్రియులకు పసందైన విందు. ఆఖరి ర్యాలీ వరకూ ఉత్కంఠగా సాగిన వీరి మ్యాచ్‌లు ఫ్యాన్స్‌ను మునివేళ్లపై నిలబెట్టాయి. అలాంటి తైజు ఆటకు వీడ్కోలు పలకడంతో సింధు భావోద్వేగానికి లోనైంది. '15 ఏళ్లుగా నీతో తలపడిన ప్రతి మ్యాచ్ మరపురానిదే. ఆ మ్యాచ్‌ల నుంచి ఓ అథ్లెట్‌గా ఎంతో మెరుగయ్యా' అని సింధు సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.